MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఏపిమాస్ చర్చలు!





ఎస్ హెచ్ జి లు, ఎఫ్ పి ఓల బలోపేతంపై ఆంధ్రప్రదేశ్ సెర్ప్ మంత్రి శ్రీ కొండపల్లె శ్రీనివాస్, అటవీశాఖ ప్రధానాధికారి శ్రీ చిరంజీవి చౌదరితో ఏపిమాస్ సి ఇ ఓ.,ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి

## ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవంలో మన డ్రోన్ దీదీ!



శ్రీ నల్లారెడ్డి స్వామి ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యురాలు, కాపు రాణీ దేవి గారు (కుడివైపునుంచి రెండవ వ్యక్తి) డ్రోన్ దీదీ గా ఎంపికై ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న దృశ్యం

## ఎఫ్ పి ఓ మహిళలకు నాబార్డ్ తోడ్పాటుతో డ్రోన్ల అందజేత



వరంగల్లులో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల

## ఏపిమాస్ కు మరో కీలక భాగస్వామ్యం !



భారత జాతీయ సహకార మండలి (ఎన్ సి యు ఐ) తో ఏపిమాస్ ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం




మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో ఏపిమాస్ ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓలతో ఎస్ బి ఐ అనుసంధాన సమావేశం

### స్వయంసహాయ ఉపకారి కన్నుమూత




శ్రీ వై సి నందా

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 23 సంచిక 1




## ఆశాభావం!

సంపాదకీయం

ఒక ప్రక్రియ, ఒక సంస్థ, ఒక వ్యవస్థ , ఏదైనా ఒక ప్రయోగం సఫలం కావాలంటే, ఎన్నో బాలారిష్టాలు, అవాంతరాలు, అడ్డంకులను అధిగమించవలసి వుంటుంది. విత్తనం నాటడం వేరు, అది మొలిచి, మొక్కగా నిలిచి, ఏపుగా ఎదిగి, సుదృఢంగా విస్తరించి, చెట్టుగా దీర్ఘకాలం మనుగడ సాగించగలగడం వేరు. ఎన్ని క్రిమి కీటకాలు, ఎన్ని చీడపీడలు, ఎన్ని పర్యావరణ సమస్యలు చుట్టుముడతాయో చెప్పలేం. వ్యవస్థల విషయంకూడా అంతే. ఉదాహరణకు ఎఫ్ పి ఓలు అని పిలువబడే రైతు ఉత్పత్తిదారుల సంస్థల విషయమే చూస్తే, అవి సుస్థిరంగా కుదురుకోవడానికి ఎన్నో అడ్డంకులు ఎదురవుతున్నాయి. సభ్యరైతుల అవగాహనా లోపం వల్ల ఏర్పడేవి కొన్నయితే, సభ్యుల చేతిలో లేనివి అనేకం వుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎంతో ఉదాత్త, ఉన్నత ఆశయంతో ఎఫ్ పి ఓల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నది. అవి చక్కగా కుదురుకోవడానికి, అభ్యున్నతి సాధించడానికి ఎన్నో మార్గదర్శకాలను జారీచేసి కట్టుదిట్టం చేయడానికి విశేషంగా కృషి చేస్తున్నది. అయితే, క్షేత్రస్థాయి పరిస్థితులు అంతటా ఒకేలా వుండకపోవడం, కొన్ని చట్టపరమైన ప్రతిబంధకాలవల్ల కొన్ని ప్రోత్సాహాలు నిరుత్సాహకాలుగా మారుతున్నాయి. అసలే యిప్పుడిప్పుడే ఒక నిర్దిష్ట రూపం సంతరించుకుంటున్న ఎఫ్ పిఓల వ్యవస్థలో ఈ సంక్లిష్ట నియమ నిగళాలు రైతుల ఉత్సాహాన్ని నీరుగార్చి, తిరిగి 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు సంఘాల ఏర్పాటు లక్ష్యాన్నే దెబ్బతీసే ప్రమాదం వుంది. నిజానికి 70% ఎఫ్ పి ఓలు తమ నిర్వహణ ఖర్చులనే భరించలేని స్థితిలో వున్నాయి. గోరుచుట్టుపై రోకటి పోటులా వాటికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లైసెన్సులు పొందడం చాలా చికాకు కలిగించే వ్యవహారంగా మారింది. కనీస మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడానికి కూడా వాటికి ప్రభుత్వ గుర్తింపు లేదు. వాటాదారులు ఎఫ్ పి ఓలుగా ఏర్పడడానికి వ్యవసాయ, ఉద్యాన శాఖలు, సెర్ప్ మద్దతు యివ్వడంలేదు. వారికి శిక్షణల విషయంలో కూడా తోడ్పాటు వుండడంలేదు. ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు, శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు సబ్సిడీలు యిచ్చి సహకరిస్తున్నాయి. అయితే, వ్యవసాయ ఉత్పత్తులను విలువ పెంపు ఉత్పత్తులుగా ప్రాసెస్ చేసే సదుపాయాలు వారికి అందుబాటులో లేకపోవడంతో ఈ వనరులు చాలావరకు నిరుపయోగంగా వుంటున్నాయి. ఇప్పటికే ఏర్పడిన ఎఫ్ పి ఓలు ఇలా సమస్యలతో సతమతమవుతుంటే, వాటిని చక్కదిద్దకుండానే కొత్తగా అనేక ఎఫ్ పి ఓల ఏర్పాటుకు ప్రభుత్వాలు తహతహలాడుతుండడం నేల విడిచి సాముచేయడమే అవుతుంది. క్రయవిక్రయాలు సాగించాలనుకునే పలు ఎఫ్ పి ఓలు ఆర్థిక తోడ్పాటు లేక నిస్సహాయంగా వుండిపోతున్నాయి. బ్యాంకులు వాటికి రుణాలను సమకూర్చే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం అవసరం. స్వయం సహాయ సమాఖ్యలను కూడా ఎఫ్ పి ఓలతో అనుసంధానించి మార్కెట్ అవకాశాలను విస్తరించే కృషి జరగడం కూడా అవసరం. ఈ బాలారిష్టాలను అధిగమిస్తేనే కాని ఎఫ్ పి ఓలు సుస్థిరాభివృద్ధితో ఉజ్వలమైన వ్యాపార సంస్థలుగా ఎదగలేవు. ఈ అంశాలన్నిటిపైన ఏపిమాస్ కేంద్ర , రాష్ట్రాల ప్రభుత్వాలతో అనేక పర్యాయాలు సంప్రతింపులు, సమాలోచనలు సాగించింది, సాగిస్తున్నది. ఇటీవలనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వ మంత్రులతో, ఉన్నతాధికారులతో ఏపిమాస్ ఈ అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. వాస్తవిక దృక్పథంతో, క్షేత్ర స్థాయి పరిస్థితుల సదవగాహనతో అనేక ఆచరణాత్మక పరిష్కార మార్గాలను సూచించింది. ఈ చర్చలు ఆశావహంగా వుండడం, అధికారుల స్థాయిలో కొన్ని తక్షణ చర్యలకు మార్గం సుగమం కావడం ఒక శుభ పరిణామం. త్వరలోనే పీటముడులు తొలగి ఎఫ్ పి ఓల వ్యవస్థ సుదృఢంగా. సభ్యరైతులకు అనేకానేక ప్రయోజనాలు సమకూర్చే ఎనలేని సాధనంగా రూపుదిద్దుకోగలదని అశిద్దాం.


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


నేత్ర దానం మహాదానం

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి, ఎస్. ప్రహ్లాదయ్య**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: బి మౌళి**


## లోపలి పేజీలలో ....


- ఎఫ్‌పిఓలపై అన్ని స్థాయిలలో అవగాహన... 05
- హైదరాబాదులో తల్లిపాల వారోత్సవాలు 06
- డ్రోన్ల కొనుగోలుకు మరిన్ని నాబార్డ్ రుణాలు 08
- మహిళల ఆదాయాన్ని పెంచే 'నమో డ్రోన్ దీదీ' 09
- సహజ వనరులతో ఆదర్శ,ఆరోగ్య వ్యవసాయం 11
- ఇలాంటి గేదె ఒక్కటి ఉంటే చాలు.... 12
- కాకినాడలో జిల్లాస్థాయి 'వాష్' కార్యశాల 13
- పొలానికి కంచె వేసుకోవడానికీ ఒక పథకం! 13
- బూడిద, పేనుబంక తెగుళ్ళనుంచి పంటల రక్షణ 15
- కొడిగట్టిన జీవితాలను మళ్ళీ వెలిగించారు ! 18
- నేత్రదానం చేద్దాం .... చూపును ప్రసాదిద్దాం! 19
- కరువును తట్టుకునే పద్ధతిలో పంటల సాగు! 20
- అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు 22
- ఆడపిల్ల పెళ్ళి నాటికి 70 లక్షలు ... 23
- సాగుభూమిలో విద్యుత్ స్తంభం వుంటే నిబంధన 25
- 7 కేసుల్లో కుమార్తెలకు ఆస్తిలో వాటా ఉండదు 26
- డిపాజిట్ల సొమ్ములో మహిళల వాటా 21% 27
- 5 ఎకరాల రైతులకు కేంద్ర 'ఆశీర్వాదం' 28
- పొలానికి కంచె వేసుకోవడానికీ ఒక పథకం! 13
- అనాథ వృద్ధుల సేవలో తరిస్తున్న యోజన ! 30
- తల్లిదండ్రులూ ... పిల్లలతో బహుపరాక్ 32
- 20 లక్షల పెట్టుబడితో రూ.95 లక్షల లాభం 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


నేత్రదానం చెయ్యాలన్న మీ కోరికను నేడే మీ కుటుంబ సభ్యులకు తెలియజేయండి

# ఎఫ్ పి ఓలపై ఇక అన్ని స్థాయిలలో అవగాహన పెంపు

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశం కీలక చర్చలు : ఏపిమాస్ సి ఇ ఓ సలహాలు, సూచనలు**

**ఎఫ్** పి ఓలను బలోపేతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంబంధిత శాఖల అధికారులకు అవగాహనను పెంపొందించే కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో 2024 ఆగస్టు 13న జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయం, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ శ్రీ డిల్లీరావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖడైరెక్టర్ శ్రీమతి విజయ సునీత, ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, మార్క్‌ఫెడ్ ఎం డి శ్రీ నసీర్, పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ ప్రతినిధులు, ఎపిమాస్ సిఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ సి ఎస్ రెడ్డి ఎఫ్ పి ఓల తీరుతెన్నులపై సవివిరంగా ప్రెజెంటేషన్ చేశారు.

ఎఫ్ పి ఓ పోర్టల్‌ను వ్యవసాయ శాఖ లేదా మార్క్‌ఫెడ్ రూపొందించాలని, వీలున్నంత త్వరలో ఎస్ ఎల్ సి సి సమావేశాన్ని నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సంబంధిత అధికారులందరూ ఎఫ్ పి ఓ లతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవాలని, వచ్చే నెలరోజులలో ఎఫ్ పి ఓల నెలవారీ సమావేశాలలో, వార్షిక సర్వసభ్య సమావేశాలలో పాల్గొనాలని సమావేశం తీర్మానించింది. ఎఫ్ పి ఓల నిర్వాహక సంస్థలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని కూడా సమావేశం అభిప్రాయపడింది.

జిల్లాల కలెక్టర్లు జిల్లా పర్యవేక్షణ సంఘు (డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కమిటి) సమావేశాలను నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ పథకం, లేదా ఇతర పథకాల కింద ఏర్పాటైన ఎఫ్ పి ఓల ప్రస్తుత స్థితిపైన, స్థాయిపైన నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీచేయాలని కూడా సమావేశం నిర్ణయించింది. అన్ని జిల్లాల డి ఏ ఓలు, డి పి ఎంలు ఎఫ్ పి ఓలపై శ్రీ సి ఎస్ రెడ్డి చేసిన ప్రెజెంటేషన్‌ను గమనించి, జిల్లాలోని అన్ని (సి ఎస్ ఎస్ లేదా ఇతర) ఎఫ్ పి ఓల ప్రస్తుత స్థితిపైన, సమస్యలపైన నివేదికలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని ఆదేసాలు జారీ చేశారు.

మార్క్‌ఫెడ్ ఎం డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ తమిళనాడును సందర్శించి ఆంధ్రప్రదేశ్‌లో నోడల్ ఏజెన్సీ ఏర్పాటుపై ప్రణాళికను సమర్పించవలసి వుంటుంది. శాఖాధిపతులు తమ క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ పి ఓల నిర్వహణపైన, ముఖ్యంగా మార్కెటింగ్ అనుసంధానాలపై అవగాహన కల్పించాలని కూడా సమావేశం ఆదేశించింది.

ఎఫ్ పి ఓల మౌలిక సమాచార (డేటా బేస్) వేదిక రూపకల్పనలో, ఎఫ్ పి ఓలకు శిక్షణ యివ్వడం, సామర్థ్య నిర్మాణంలో, ఎఫ్ పి ఓలను అభ్యుదయ వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడంలో ఏపిమాస్ సహకారం అందించాలని సమావేశం అభిప్రాయపడింది.

## స్వయంసహాయ వ్యవస్థపై సెర్ప్ మంత్రి శ్రీ శ్రీనివాస్‌తో శ్రీ సి ఎస్ రెడ్డి చర్చలు

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ స్థాయిలలోని స్వయంసహాయ సమాఖ్యల స్థితిగతులు, అవి ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలు, స్వయం నియంత్రణతో సుస్థిరాభివృద్ధి సంస్థలుగా వాటిని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత, ఎఫ్ పి ఓలతో ఎస్ హెచ్ జి ల అనుసంధానం తదితరఅంశాలపై ఆంధ్రప్రదేశ్ సెర్ప్, ఎం ఎస్ ఎం ఇ, ఎన్ ఆర్ ఐ వ్యవహారాల మంత్రి శ్రీ కొండపల్లి శ్రీనివాస్ తో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి 2024 ఆగస్టు 13 న మంత్రి కార్యాలయంలో కూలంకషంగా చర్చించారు. ఉభయుల చర్చలో యిందుకు సంబంధించిన కార్యాచరణపై స్థూలంగా ఒక అవగాహనకు వచ్చినట్టు తెలిసింది. ■

# హైదరాబాదులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**– భవాని, జాహ్నవి**

ప్రపంచ తల్లి పాలవారోత్సవాలను పురస్కరించుకుని 'పట్టణ పోషణ పథకం' బృందం హైదరాబాదు మహానగరంలోని కార్వాన్‌లో, మెహిదీపట్నంలో తల్లి పాలవారోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకల ప్రధాన లక్ష్యాలు ప్రసూతి ఆసుపత్రులలో తల్లి పాల సంస్కృతికి వున్న అంతరాలను తెలియజేయడం, అంతరాలను పూరించడానికి అవసరమైన వనరులను, ఉపకరణాలను గురించి తెలియపరచడం, తల్లి పాల సంస్కృతి వల్ల తల్లులకు, పిల్లలకు కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వ అధికారులతో, ఆరోగ్య నిపుణలతో చర్చించడం, ఇందుకు తగ్గ కార్యాచరణ పద్ధతులను ఆసుపత్రుల యాజమాన్యాలకు, ఆరోగ్య సిబ్బందికి తెలియజేయడం.

| *2024 ప్రపంచ తల్లి పాల వారోత్సవ నినాదం* |
|---|
| *'అంతరాలను పూరించి , తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం'* |

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5, 2021) ప్రకారం, 88.8% మహిళలు ఆసుపత్రులలో ప్రసవిస్తున్నారు. కానీ వారిలో 41.6% బాలింతలు మాత్రమే పుట్టిన వెంటనే మొదటి గంటలో శిశువుకు తల్లి పాలను పట్టిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా, ఏటా తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటున్నా, ఈ సంఖ్య 50 శాతానికి కూడా చేరడంలేదు. ఇంతే కాకుండా, వ్యవస్థలో కొన్ని లోపాలు, అంతరాలు ఉన్నాయి. ఈ లోపాలను తొలగించడానికి ప్రత్యేక చర్యలు, మద్దతు అవసరం.

ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని ఆసక్తికరమైన కార్యకలాపాలను నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో పట్టణ పోషణ పథకం బృందం అంగన్‌వాడి కేంద్రాలలో, ప్రభుత్వ ప్రభుత్వేతర ప్రసూతి ఆసుపత్రులలో, పాఠశాలలలో సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాలలో తల్లులు, ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయ సంఘాలు, బడి పిల్లలు (8, 9, 10వ తరగతి విద్యార్థినులు), సమాజ సభ్యులతో కీలక అంశాలపై చర్చించింది.

వీటిలో ముఖ్యంగా, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు ప్రారంభించడం, మొదటి ఆరు నెలల వయస్సు వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇప్పించడం, ఆరు నెలల మీదట యింట్లోనే తయారుచేసిన ఆహారం అదనంగా ప్రారంభించడం, తల్లి పాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు లేదా వీలైనంత ఎక్కువ కాలం ఇప్పించడం వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించు





కున్నాయి. వీటిని బ్రెస్ట్ ఫీడింగ్ అండ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, యునిసెఫ్, డబ్ల్యుహెచ్‌ఓ, ఎన్ ఐ ఎన్ వంటి సంస్థలు సరైన పోషణ విధానాలుగా సిఫార్సు చేస్తున్నాయి.

**ప్రశ్నోత్తరాలు , ర్యాలీలు:** తల్లి పాల ప్రాముఖ్యత గురించి సమాజంలోని సభ్యులకు నేర్పడానికి ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. తల్లులకు అందుబాటులో ఉన్న మద్దతు గురించి అవగాహన కల్పించేందుకు ర్యాలీలను కూడా నిర్వహించారు.

**తల్లుల సమావేశాలు:** 80 మంది గర్భిణులు, పాలిచ్చే తల్లులతో సమావేశాలు నిర్వహించి, తల్లి పాల పెంపుదలలో ఉన్న సవాళ్ళను, పరిష్కారాలను చర్చించేందుకు వేదిక ఏర్పాటైంది.

**ప్రాధాన్య గృహ సందర్శనలు:** 60 మంది గర్భిణులు, కొత్త తల్లులకు వ్యక్తిగత సలహాలు, మద్దతు అందించటం కోసం బృందం గృహ సందర్శనలు నిర్వహించింది. పిల్లల వయసుకు తగ్గ ఎత్తు బరువుపై అవగాహన కల్పించింది.

**సమాజ సమావేశాలు :** ఈ సమావేశాలలో 200 మంది మహిళలు, ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు, వివిధ భాగస్వాములు పాల్గొన్నారు. తల్లి పాల ప్రాముఖ్యత, సవాళ్ళు, వాటిని అధిగమించటంలో సమాజ మద్దతు పాత్రను గురించి చర్చించటానికి ఈ సమావేశాలు పునాది వేశాయి.

**ప్రసూతి ఆసుపత్రి సందర్శనలు:** ఆసుపత్రుల పరిపాలనా విభాగం నుండి అనుమతి పొంది, జయభూషణ్ హాస్పిటల్, బటర్‌ఫ్లై హాస్పిటల్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలను సందర్శించి తల్లిపాలు ఇవ్వటంలో మెలకువల గురించి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే అక్కడ ఉన్న ఆసుపత్రి సిబ్బందికి (నర్సులకు) కూడా పై అంశాలలో తల్లులకు ఏవిధంగా సహకారం అందించాలో తెలియచెప్పడం జరిగింది.

**సహభాగస్వాముల భాగస్వామ్యం:** సంవేదన కార్యక్రమాల్లో ప్రభుత్వం, అనుపాధి భాగస్వాములు, ముఖ్యంగా వైద్య నిపుణులు, సమాజ నాయకులు, ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు. తల్లి పాల మద్దతును ఇప్పటి ఆరోగ్య సేవలతో, సమాజ కార్యక్రమాలతో సమన్వయం చేసేందుకు వారి భాగస్వామ్యం ఎంతో ముఖ్యం. వారం రోజులపాటు నిర్వహించిన కార్యకలాపాలు తల్లులకు తల్లి పాల పోషణ గురించి అవగాహన కలిగించడంలో, ధైర్యం ఇవ్వటంలో సహాయ పడ్డాయి. తద్వారా తల్లులకు, పిల్లలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించటానికి దోహదపడతాయి.

■

పది మందికి ఆదర్శంగా ఉండాలంటే మరణానంతర నేత్రదానం చేయండి

# డ్రోన్ల కొనుగోలుకు మరిన్ని నాబార్డ్ రుణాలు

**వ్య**వసాయ మౌలిక సదుపాయాల నిధి కింద డ్రోన్ల కొనుగోలుకు ఎఫ్ పి ఓలకు మరిన్ని రుణాలు అందిస్తామని నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల పేర్కొన్నారు. వరంగల్లు క్లస్టర్‌కు చెందిన 5 ఎఫ్ పి ఓలకు (అయినవోలు, అసనపర్తి, నెక్కొండ, నేలమ్మ, జఫర్‌గడ్) డ్రోన్లు అందజేసిన సందర్భంగా ఆగస్టు 27 వ తేదీన వరంగల్లులో జరిగిన సభలో శ్రీమతి సుశీల చింతల ఈ ప్రకటన చేశారు.



నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం, కార్నెల్స్ సద్గురు ఫౌండేషన్ డెవలప్‌మెంట్ (సిఎస్ఎఫ్‌డి) సంస్థ సహకారంతో, వ్యవసాయ డ్రోన్ల ద్వారా తెలంగాణలోని గ్రామీణ యువతకు ఉపాధిఅవకాశాలను మెరుగుపరచ దానికి డ్రోన్ల కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటును సులభ తరం చేయడానికి కృషి చేస్తున్నది. ఇందులో భాగంగా నాబార్డ్ ఆర్థిక సహకారంతో కార్నెల్స్ సద్గురు ఫౌండేషన్ 13 లక్షలు వెచ్చించి 2024 మే లో తెలంగాణలోని ఎన్ఐపిహెచ్ఎంలో 24 మంది పైలట్లకు 12 రోజుల శిక్షణను అందించి డిజిసిఎ డ్రోన్స్ పైలెట్ లైసెన్స్ సర్టిఫికెట్లను జారీ చేసింది.



ఈ శిక్షణలో వరంగల్ క్లస్టర్ నుంచి 5 ఎఫ్‌పిఓ లకు (రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు) సంబంధించిన 8 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారికి డి జి సి ఎ ద్వారా పైలెట్ లైసెన్స్‌లు ఇవ్వడం జరిగింది.

'ఆత్మ నిర్భర భారత్ అభియాన్ మిషన్'లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి ద్వారా 3% వడ్డీ పై రాయితీ రుణాలను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యవసాయ డ్రోన్లను సమకూర్చారు.

అయినవోలు, అసనపర్తి, నెక్కొండ, నేలమ్మ, జఫర్‌గఢ్ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రూ. 34.8 లక్షల రుణాలను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, నాబ్‌స్కాన్ అందజేశాయి.

500 మంది చిన్న, సన్నకారు రైతులతో వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో రైతు ఉత్పత్తి దారుల సంఘాలను నాబార్డ్ ఏర్పాటు చేసింది.

ఈ కార్యక్రమంలో శ్రీమతి సుశీల చింతల తో పాటు ఏ పీ జీ వీ బీ చైర్మన్, ఎం రవీందర్‌రావు, చైర్మన్, టెస్కాబ్, శ్రీమతి హేమలత విజయరాఘవ డైరెక్టర్ కార్నెల్స్ సద్గురు ఫౌండేషన్, శ్రీ చంద్రశేఖర్, ఏజీఎం, వరంగల్ క్లస్టర్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, సహ రైతులు పాల్గొన్నారు. ■

కొన్ని సందర్భాలలో వైద్యులు కూడా చూపును ప్రసాదించ లేరు, కాని నేత్రదానంతో మనం ఆ పని చేయగలం.

# సంఘ మహిళల ఆదాయాన్ని పెంచే 'నమో డ్రోన్ దీదీ'

నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 నవంబర్ 30న విడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ పథకం ప్రధాన లక్ష్యం స్వయం సహాయ సంఘాలలోని మహిళా సభ్యులకు మరింత రాబడి పొందడానికి ఒక అవకాశాన్ని కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు దోహదంచేయడం. ఈ పథకాన్ని "నమో డ్రోన్ దీదీ యోజన" లేదా "ప్రధానమంత్రి డ్రోన్ దీదీ పథకం" పేర్లతో కూడా పిలుస్తారు.

- నమో డ్రోన్ దీదీ పథకం కింద భారత ప్రభుత్వం మహిళా స్వయం సహాయ సంఘాలకు సబ్సిడీ ధరపై డ్రోన్‌ను అందిస్తుంది.
- ఈ డ్రోన్‌లను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు అద్దె కోసం ఉపయోగించవచ్చు.
- రైతులకు అద్దెకుడ్రోన్ సేవలు అందించబడతాయి.
- వ్యవసాయ క్షేత్రంలో పురుగుమందులు లేదా ఎరువులు పిచికారీ చేసే పని డ్రోన్ల సహాయంతో చేయబడుతుంది.
- ఇది మహిళా స్వయం సహాయ సంఘాలసభ్యులకు మరింత సంపాదించడానికి సహాయపడుతుంది. రైతుల నిర్వహణ ఖర్చు తగ్గుతుంది. ఇది పని సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- నమో డ్రోన్ దీదీ పథకం కింద డ్రోన్ కొనుగోలు చేయడానికి, సబ్సిడీని క్లెయిమ్ చేయడానికి మహిళా స్వయం సహాయ సంఘాలు మాత్రమే అర్హులు.
- లబ్ధిదారులైన మహిళలు దరఖాస్తు విధానం గురించి లేదా నమో డ్రోన్ దీదీ పథకం గురించి మరింత సమాచారం కోసం వారి సమీప గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

**పథకం ప్రయోజనాలు**

- డ్రోన్ కొనుగోలుపై స్వయం సహాయ సంఘాలకు సబ్సిడీ అందించబడుతుంది.
- డ్రోన్ ధరలో 80% సబ్సిడీ లేదా గరిష్టంగా రూ. 8 లక్షలు అందజేస్తారు.
- డ్రోన్ మిగిలిన ఖర్చు కోసం ఏ ఐ ఎఫ్ నుండి రుణ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.
- రుణంపై నామమాత్రపు వడ్డీ 3%.
- డ్రోన్ శిక్షణ కూడా ఇవ్వనున్నారు.
- మహిళా ఎస్‌హెచ్‌జిలు రైతులకు సేవలను అందించ డానికి అద్దె కోసం ఈ డ్రోన్‌ను ఉపయోగించవచ్చు.

## ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవానికి గోనేగండ్ల 'డ్రోన్ దీదీ'!

గోనేగండ్ల గ్రామం శ్రీ నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘానికి కోరమాండల్ కంపెనీ సౌజన్యంతో 'నమో డ్రోన్ దీదీ పథకం" కింద 2024 మార్చ్ 28న సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కాపు రాణిదేవి గారి పేరు మీద డ్రోన్‌ను అందజేశారు. 2024 ఏప్రిల్ నెలలో సంఘం సభ్యుడు వీరేష్ గారి పొలంలో ఈ డ్రోన్ సహాయం తో రెండు ఎకరాల పత్తి పొలంలో ప్రయోగాత్మకంగా పురుగు మందులను చల్లారు.



నమో డ్రోన్ దీదీ కార్యక్రమంలో భాగంగా శ్రీ నల్లారెడ్డి స్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘం నుండి బోర్డ్ ఆఫ్ డైరక్టర్ శ్రీమతి రాణిదేవి 2024 ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకలో పాల్గొనడం విశేషం. ■



బట్టి, సమాజం కోసం వారి పనితీరు ఆధారంగా జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది.

- ఎంపిక చేయబడిన మహిళా స్వయం సహాయ సంఘాల జాబితాను జిల్లా కమిటీ తయారు చేస్తుంది మరియు ఎంపిక గురించి స్వయం సహాయ సంఘాల అధిపతికి తెలియజేయబడుతుంది.
- ఎంపిక చేసిన స్వయం సహాయ సంఘాల మహిళా సభ్యులందరికీ డ్రోన్‌ను ఎలా ఎగరవేయాలి. ఇతర సాంకేతికతలకు సంబంధించిన శిక్షణ అందించబడుతుంది.

- మహిళా స్వయం సహాయ సంఘాలు డ్రోన్ సహాయంతో సంవత్సరానికిఅదనంగా రూ. 1 లక్ష సంపాదించవచ్చు

**అర్హత ప్రమాణాలు**

- రిజిస్టర్డ్ మహిళా స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జి) మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- డ్రోన్‌ను వ్యవసాయ కార్యకలాపాల కోసం అద్దెకు మాత్రమే వినియోగిస్తారు.

**అవసరమైనపత్రాలు**

- మహిళా స్వయం సహాయ సంఘ (ఎస్‌హెచ్‌జిల) నమోదు సంఖ్య.
- మహిళా సభ్యుల ఆధార్ కార్డ్.
- మహిళా ఎస్‌హెచ్‌జిల బ్యాంక్ ఖాతా వివరాలు.
- మొబైల్ నంబర్.
- దరఖాస్తు

**మహిళా స్వయం సహాయక సంఘాల ఎంపిక**

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ నమో డ్రోన్ దీదీ పథకం కింద అర్హులైన మహి ళా స్వయం సహాయ సంఘాలను ఎంపిక చేస్తుంది.
- మహిళా స్వయం సహాయ సంఘాలను ఆర్థిక స్థితిని

- డ్రోన్ కొనుగోలుపై సబ్సిడీ, రుణం శిక్షణ పూర్తయిన తర్వాత మాత్రమే అందించబడుతుంది.

డ్రోన్ సహాయముతో ఒకసారి 10 లీటర్ల నీటిలో ఒకఎకరాకి తగిన పెస్టిసైడ్స్‌ని కలిపి పిచికారి చేయవచ్చు. ఒక ఎకరా పొలాన్ని 15 నిమిషాల కాల వ్యవధిలో పెస్టిసైడ్స్ పిచికారి చేయవచ్చు. ఈ డ్రోన్‌కు 5 బ్యాటరీలు అందించడం జరిగింది. వీటి సహాయంతో ఒకరోజులో 10 ఎకరాల పొలంలో పిచికారి చేయవచ్చు.

ఇదికాకుండా ఎక్కువ ఎకరాలో స్ప్రేయింగ్ చేయాలని అనుకుంటే బ్యాటరీని మళ్ళీ ఛార్జ్ చేసి మళ్ళీ స్రేయింగ్ చేసుకోవచ్చు... అలా ఒక రోజులో ఎన్నిసార్లయినా ఛార్జ్ చేసి స్ప్రేయింగ్ చేసుకోవచ్చు.

తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలుస్ప్రేయింగ్ చేయవచ్చు. తద్వారా సమయం ఆదా అవుతుంది. కూలీ పనివారు అవసరం లేదు. స్ప్రేయింగ్ అయ్యే ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు. మనుషులు పిచికారి చేసే సమయంలో స్ప్రేయింగ్ చేస్తున్న వ్యక్తిపై పురుగు మందులు పడడం వల్ల ఆ వ్యక్తి అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉంది.

డ్రోన్ ద్వారా ఆ సమస్యలు నివారించవచ్చు. మొక్క పై భాగం నుండి స్ప్రేయింగ్ చేయడం ద్వారా మొక్క మొదళ్ళలోకి పెస్టిసైడ్స్ వెళ్లడం ద్వారా చీడపీడలను అరికట్టడానికి సులువుగా ఈ డ్రోన్ ఉపయోగపడుతుంది. ■

# సహజ వనరులతో ఆదర్శ, ఆరోగ్య వ్యవసాయం!

– జి. అమరేంద్ర

పూర్వంనుంచి వ్యవసాయం మనిషి జీవనాధారంగా ఉంది. కానీ గత కొన్ని దశాబ్దాలుగా అధిక దిగుబడి పొందటానికి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తూ వివిధ రకాల సంకరజాతి, జన్యు మార్పిడి పంటలను రసాయనిక ఎరువులతో పండిస్తున్నారు. పంటల సాగుకు రసాయనాలను విరివిగా ఉపయోగించడం వల్ల భూమి కలుషితం అవుతున్నది.

అధికంగా పురుగు మందులు, రసాయనాల వాడకం వల్ల పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతున్నది. జీవ వైవిధ్యం దెబ్బ తింటున్నది. వినియోగదారుల ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావం కలుగుతున్నది.

ఇందుకు ప్రత్యామ్నాయంగా సహజ–సేంద్రియ వ్యవసాయంతో ఈ సమస్యలను పరిష్కరించవచ్చు.

సహజ వ్యవసాయాన్ని "రసాయన రహిత వ్యవసాయం, పశువుల ఆధారిత వ్యవసాయం" అని అంటారు. సహజ వ్యవసాయ పద్ధతిలో పంటలను, చెట్లను, పశుసంపదను సమ్మిళితపరచడం వల్ల వ్యయసాయంలో సుస్థిరత ఏర్పడు తుంది. పర్యావరణంపై దుష్ప్రభావాలు తగ్గి, జీవ వైవిధ్యం పెరిగి, ఆహారభద్రత, పశువుల సంక్షేమం మెరుగుపడుతుంది.

సహజ వ్యవసాయం పంటపై పెట్టుబడి ఖర్చులను తగ్గించి, రైతులకు అధిక దిగుబడి అందించి, రసాయన రహిత ఆహారం పండించడంలో సహాయపడుతుంది. పంటలు కలుషితం కావు, భూసారం మరింత పెరుగుతుంది.

వాతావరణంలో విషవాయువుల శాతం తగ్గి పర్యావరణ సమతుల్యత పెరుగుతుంది. అందుకే వివిధ దేశాల ప్రభుత్వాలు కూడా ఈ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

ఈపద్ధతుల వలన వ్యయసాయం మళ్ళీ పునరుద్ధరించ బడి, మన భూగోళం సంరక్షింపబడుతుంది.

దీని ఫలితంగా భూమిలో కర్బన శాతం పెరిగి, నేల ఆరోగ్యం, మొక్కల ఆరోగ్యం మరింత బలపడుతుంది.

**ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం**

మన దేశంలో చాల రాష్ట్రాలు సహజ వ్యవసాయ పద్ధతులు చేస్తున్నప్పటికి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత దేశానికే ఆదర్శంగా ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. వ్యవసాయానికి సహజ సేద్యం కొత్త మార్గాన్ని సూచిస్తోందని తెలిపింది.

ప్రకృతి సేద్యం వల్ల పురుగు మందులపై ఆధారపడటం తగ్గుతోందని, జీవవైవిధ్యం సుసంపన్నం అవుతుందని తెలియజేసింది. ఇదే తరహాలో దేశమంతటా ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కార్యక్రమాల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నాయి.

సురక్షితమైన పద్ధతిలో వ్యవసాయం చేయాల్సిన అవసరాన్ని భారత ప్రభుత్వం గుర్తించి భూసారాన్ని పరిరక్షించడం కొరకు " పరంపరాగత్ క్రిషి వికాస్ యోజన (పికెవివై) కింద "భారతీయ ప్రకృతి కృషి పద్ధతి కార్యక్రమం (బిపికెపి)", "రాష్ట్రీయ కృషి వికాస్ యోజన" వంటి అనేక పథకాలను రూపొందించి, మన దేశ రైతులు సహజ/సేంద్రియ వ్యవసాయం చేపట్టేలా రైతు సమూహాలకు ప్రేరణ కలిగిస్తున్నది.

**సహజ లేదా ప్రకృతి వ్యవసాయం**

సహజ లేదా ప్రకృతి వ్యవసాయం అంటే ప్రకృతిలో లభ్యమయ్యే చెట్లను, పంటలను , గో ఆధారిత ఉత్పత్తులను ఉపయోగించుకుని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను సాగు చెయ్యడం.

- రసాయన ఎరువులు వాడకూడదు.
- రసాయన పురుగు మందులు, కలుపును

→

# ఇలాంటి గేదె ఒక్కటి ఉంటే చాలు, రైతు పంట పండినట్టే !

**గు**జరాత్ లోని బనస్కాంత జిల్లా ప్రజలు ఎక్కువగా వ్యవసాయం మరియు పశుపోషణలో నిమగ్నమై ఉన్నారు. జిల్లాలో అనేక మంది పశుపోషకులు పశువుల పాల ద్వారా ఏటా లక్షల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇందులో గ్రామానికి చెందిన ఒక రైతుకు ఒక గేదె ఉంది. ఇది మొత్తం బనస్కాంతలో అత్యధిక పాలను ఇవ్వడం ద్వారా మొదటి స్థానంలో ఉంది.

బనస్కాంతలోని పాలన్పూర్లోని తకర్వాడకు చెందిన నంజీభాయ్ చౌదరి వయసు 50 ఏళ్లు. బీఏ వరకు చదువుకున్నాడు. అతని కుటుంబం కొన్నేళ్లుగా పశుపోషణ చేస్తూ జీవనం సాగిస్తోంది

నంజీభాయ్ చౌదరి పశుపోషణలో చేరినప్పుడు ఒక



గేదెతో ప్రారంభించాడు. అనంతరం ఈ వ్యాపారంలో లాభాలు ఎక్కువ వస్తుండటంతో పశుపోషణపై దృష్టి పెట్టాడు. ఇప్పుడు అతని వద్ద 12 గేదెలు ఉన్నాయి. అందులో ఓ గేదె చాలా ప్రత్యేకమైనది.

నాంజిభాయ్‌తో ఉన్న గేదె ఇతర గేదెల కంటే భిన్నంగా ఉంటుంది. దీని ఎత్తు, శరీరం కూడా ఇతర గేదెల కంటే ఎక్కువగా ఉంటాయి. ఈ గేదె రోజుకు 28 లీటర్ల పాలు ఇస్తుండగా, నాంజిభాయ్ దగ్గర ఉన్న ఇతర గేదెలు రోజుకు 10 నుంచి 12 లీటర్ల పాలు మాత్రమే ఇస్తాయి

నంజీభాయ్ చౌదరి నెలకు రూ. 15,000 ఖర్చు చేస్తూ తన పొలంలోని పశుగ్రాసం, ధాన్యాలతో గేదెలకు ఆహారంగా ఇస్తాడు. దీని ద్వారా ఈ గేదె నాంజీభాయ్‌కు నెలకు రూ. 60,000 ఆదాయం ఇస్తుంది. ఈ గేదె మొత్తం బనస్కాంత జిల్లాలో అత్యధికంగా పాలు ఇచ్చే గేదె కావడంతో.. బనాస్ డెయిరీ దీనికి ప్రథమ స్థానం ఇచ్చి గౌరవించింది. అదే సమయంలో డెయిరీ ద్వారా రూ. 30వేలు పశుపోషకుడికి అందజేశారు. నంజీభాయ్ మొత్తం ఆదాయం, ఖర్చుల గురించి మాట్లాడితే... అతను ప్రతి సంవత్సరం 12 పశువుల పాల నుండి రూ . 22 లక్షలు సంపాదిస్తున్నాడు. వీటి కోసం ఏటా రూ. 10 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

– న్యూస్ 18 సౌజన్యంతో....

■

నివారించడానికి మందులను వాడకూడదు.

- డబ్బు ఖర్చయ్యే ఏ వనరులు వాడకూడదు.

**ప్రకృతి లేదా సహజ వ్యవసాయ ముఖ్య ఉద్దేశాలు**

- పురుగు మందుల అవశేషాలు లేకుండా వ్యవసాయ పద్ధతులు పాటించడం
- పంట వ్యర్థాలను ఉపయోగిస్తూ, ఆవుపేడ , గంజుతో తయారుచేసిన సేంద్రియ ఎరువులను వాడడం
- కలుపు నివారణకు రసాయనాలు కాకుండా, ఆచ్ఛాదన పద్ధతిని అనుసరించడం

**ప్రకృతి వ్యవసాయంలో 5 ముఖ్య పద్ధతులు**

1. బీజామృతంతో విత్తన శుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్)
2. జీవామృతం (బయో ఫర్టిలైజర్)
3. ఆచ్ఛాదన (మల్చింగ్)
4. వాఫ్స (వాటర్ మేనేజ్‌మెంట్)
5. సస్యరక్షణ (ప్లాంట్ ప్రొటెక్షన్)

■

**నేత్రాలను దానం చేస్తే ఆ వ్యక్తి మన మధ్య లేకపోయినా కళ్ళు జీవించే ఉన్నాయన్న తృప్తి వుంటుంది**

# కాకినాడలో జిల్లాస్థాయి 'వాష్' కార్యశాల

– రాజోజుల బ్రహ్మాచారి

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లాలో ఏపిమాస్ ఆధ్వర్యంలో వాటర్.ఆర్గ్ సంస్థ మద్దతుతో కాకినాడ పట్టణం లోని డిఆర్‌డిఏ జిల్లా సమాఖ్య కార్యాలయంలో 23.08.2024 నాడు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) పై జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించడం జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి రమణి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి ప్రియంవద, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్



ఇంజనీర్ శ్రీమతి ఎంవికె మాధవి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి కాంచన, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీ బాపూరావు, శ్రీమతి వేదకుమారి, శ్రీ భరత్‌కుమార్, శ్రీ కేశవ, మెప్మా హెల్త్, న్యూట్రిషన్ జిల్లా అధికారి శ్రీమతి జ్యోతి, మెప్మా జీవనోపాధుల విభాగం జిల్లా అధికారి శ్రీ మోహన్, ఏపిమాస్ వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, జిల్లా సమన్వయకర్త శ్రీమతి చంద్రకాంతం ప్రభృతులు పాల్గొన్నారు.

తొలుత శ్రీమతి ప్రియంవద మాట్లాడుతూ నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) అనే అంశాలను ప్రతి కుటుంబంలో పాటించాలని, నీటి వినియోగం, త్రాగే నీటిని ఎలా శుభ్రపరుచుకోవాలో తెలుసుకోవాలని, మరుగు దొడ్లను సరైన పద్ధతుల ద్వారా ఉపయోగించడం వలన రోగాలు దరికి చేరవు అని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై మన జిల్లాలోని సంఘాలలో అందరికి వివరించాలని, ఏపిమాస్ లాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ అంశాలపై ప్రజలకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని పేర్కొన్నారు.

తర్వాత శ్రీ రాజోజుల బ్రహ్మాచారి నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్)పై జిల్లా స్థాయి కార్యశాల ఉద్దేశము, ఎజెండా, ఏపిమాస్ 23 సంవత్సరాల సుదీర్ఘ అనుభవాలు, లక్ష్యాలు, సంస్థ విలువలు, చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఇళ్ళలో నీటి వసతులు, మరుగుదొడ్డి సమస్యల పరిష్కారం కోసం ఆర్థిక వనరులను సమకూర్చటానికి, నిపుణుల సేవలు అందించడానికి సులభంగా తిరిగి చెల్లించగల చిన్నపాటి రుణాలను పొందేలా చేయడం జరిగిందని చెప్పారు.

కాకినాడ జిల్లాలో 5 మండలాలలో 7 మునిసిపాలిటీ లలో 536 మంది వి.ఓ.ఎ, ఆర్.పి లకు వాష్‌పై అవగాహన కల్పించడం జరిగిందని, ఇప్పటివరకు 11,155 వాష్ రుణాలను సమీకరించి 12.22 కోట్ల మూలధనాన్ని వాష్ అవసరాల కోసం వాడుకునేటట్లు చేయడం జరిగిందని



వివరించారు. సామజిక నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేసేవారికి సబ్సిడీ రూపేణ రెండు లక్షల వరకు ఏపిమాస్ సమకూరుస్తుందని చెప్పారు.

కాకినాడ మునిసిపల్ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి యంవికె మాధవి ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాల పరిశుభ్రత సక్రమంగా ఉండాలని వివరిస్తూ, వర్షాకాలంలో నీరు నిలిచిపోతే దోమలు పెరుగుతాయని దోమకాటు వల్ల డెంగ్యు , మలేరియ మరియు చికున్ గున్యా లాంటి రోగాలకు గురి కావడం జరుగుతుందని, అందువల్ల వాతావరణన్ని పొడిగా ఉంచుకోవాలని మరుగుదొడ్డిని, మరుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నగరాన్ని ఆరోగ్య కాకినాడగా తీర్చిదిద్దాలి అని వివరిస్తూ, తడి చెత్త, పొడిచెత్త వేరుచేయాలి అన్నారు.

జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మహిళా సంఘాలు వాటర్ టెస్టింగ్, వాటర్ బిల్ వసూళ్ళు వంటి కార్యక్రమలను నిర్వహిస్తున్నా యని, వీటి ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న నీరు సురక్షితమైనదని చెప్పారు.

ముఖ్య అతిధి, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి రమణి మాట్లాడుతూ, ఈ కార్యశాలకు హాజరైన అధికారులు వాష్ కార్యక్రమంపై తమ అభిప్రాయాలు చెప్పాలని వారి సలహాలు, సూచనలు తీసుకొని ప్రాజెక్ట్‌ను మరింత మెరుగుపరచడానికి కృషి చేయవచ్చునని అన్నారు.

నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) అంశాలను ప్రతి ఎస్‌హెచ్‌జి / విఓ / ఎస్ఎల్ఎఫ్ / టిఎల్ఎఫ్ / యంఎస్/ జిల్లా సమాఖ్యల సమావేశాలలో ఎప్పటికప్పుడు చర్చించేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

చివరగా సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి వేదకుమారి వాష్ జిల్లా స్థాయి కార్యశాలకు అనుమతి యిచ్చిన కలెక్టర్‌కు, సెర్ప్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లకు, ఇతర అధికారులకు, సెర్ప్ మెప్మా సిబ్బందికి ధన్యవాదాలు తెలపడంతో కార్యశాల ముగిసింది.

■



మరణానంతరం చేసే నేత్రదానం, స్వీకర్తలకు జీవితంపై ఆశను పెంచుతుంది

# బూడిద, పేనుబంక తెగుళ్ళనుంచి పంటల రక్షణ ఎలా?

పంటలను ఎక్కువగా ఆశించే బూడిద తెగులు, పేనుబంక తెగులు లక్షణాలు ఏమిటో, వీటిని ఎలా నియంత్రించ వచ్చునో, ఇవి సోకకుండా ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలో తెలుసుకుందాం.

**బూడిద తెగులు లక్షణాలు, ఆతిథ్యం ఇచ్చేవి:**

ఇది శిలీంద్రం; దీనికి ఆతిథ్యం ఇచ్చేవి: ఆపిల్, పియర్, రాస్బెర్రీ, చిక్కుడు, వంకాయ, చెర్రీ, ఆప్రికాట్, ప్లం, పీచ్, బఠానీ, కీర దోస, గుమ్మడికాయ, కీరదోస, టమాట, క్యాబేజీ, లెట్యూస్, బంగాళాదుంప, మినుములు , పెసలు, మొక్కజొన్న, నిమ్మజాతి, కందులు, పసుపు కంది పప్పు, ఎరుపు కందిపప్పు, శనగలు, శనగపప్పు, ప్రత్తి, కర్రపెండలం, పుచ్చకాయ మొదలైనవి. మొదట ఆకుల పైభాగంలో పసుపురంగు మచ్చలు కనబడతాయి. తెగులు తరువాతి దశలో, తెల్లటి, ఆ పై బూడిద రంగు పొడి లాంటి పదార్థం ఆకులు, ఆకుకాడలు ఇంకా పండ్లను కప్పివేస్తుంది. ఈ ఫంగస్ మొక్కల నుండి పోషకాలను గ్రహించి ఒక బూడిద లాంటి పదార్థాన్ని ఆకులపై ఏర్పరుస్తుంది. దీనివలన కిరణజన్య సంయోగక్రియ జరగకుండా ఆగిపోతుంది. మొక్క ఎదుగుదల ఆగిపోతుంది.

ఈ తెగులు పెరుగుతున్న కొద్దీ సంక్రమణకు గురైన భాగాలు ముడుచుకుపోతాయి, ఆకులు కుచించుకుపోతాయి. మొక్కలు చనిపోయే అవకాశం కూడా ఉంది. ఆకులపైన పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు, కాడలు, పండ్లపైన పిండి లాంటి పదార్థం కప్పబడి ఉంటుంది. ఆకులు ముడుతలు పడి రాలిపోతాయి. ఎదుగుదల తగ్గిపోతుంది. బూడిద తెగులును కొంతవరకు నియంత్రించవచ్చు.

**తెగులు సోకే తీరు**

శిలీంద్ర బీజాంశాలు ఆకు మొగ్గలు, మొక్కల అవశేషాలలో ఉంటాయి. గాలి, నీరు, క్రిములు ఈ బీజాలను దగ్గరగా ఉన్న మొక్కలకు అంటుకునేటట్టు చేస్తాయి. బూడిద తెగులు ఒక శిలీంద్రం అయినప్పటికీ సాధారణంగా ఇది పొడి వాతావరణంలో పెరుగుతుంది. ఇది 10 నుండి 12 డిగ్రీల సెంటిగ్రేడు మధ్యలో ఉన్న ఉష్ణోగ్రతల్లో జీవిస్తుంది. కొద్దిపాటి వర్షపాతం, ఉదయం సమయాల్లో పొగమంచు ఈ బూడిద తెగులు వ్యాపించటానికి సహకరిస్తాయి.

**జీవ నియంత్రణ**

తోటల కోసం పాలు – నీళ్ళ మిశ్రమం ఒక సహజ శిలీంద్రనాశిని వలె పని చేస్తుంది. ఈ మిశ్రమాన్ని ఆకుల పైన రెండురోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ఇంట్లో తయారుచేసిన విరుగుడు మందు దోసజాతి (కీరా దోస, గుమ్మిడి) పైన, బెర్రీ పండ్ల మొక్కల పైన బాగా పని చేస్తుంది. ఈ పద్ధతి అన్నిరకాల మొక్కలపైన పని చేయదు. ఎటువంటి మెరుగుదల కనిపించకపోతే, వెల్లుల్లి లేదా సోడియం బైకార్బొనేట్ ద్రావణాన్ని ప్రయత్నించండి. వాణిజ్య జీవ నియంత్రణ పద్ధతులు కూడా అందుబాటులో ఉన్నాయి. గంధకం, కావోనిడ్ యాసిడ్, వేపనూనె, కొవానిన్ లేదా ఆస్కార్బిక్ యాసిడ్ ఆధారిత పిచికారీలు తీవ్రమైన సంక్రమణను నిరోధిస్తాయి.



**రసాయన నియంత్రణ**

వీలైనంతవరకు ఎల్లప్పుడూ జీవపరమైన నియంత్రణ, నివారణ చర్యలతో కూడిన సమీకృత సమగ్ర సస్యరక్షణ

విధానాన్ని పాటించండి. బూడిద తెగులు వల్ల చాలా పంటలు ప్రభావితం అయ్యే అవకాశం ఉండడం వలన ఈ తెగులును నివారించడానికి ప్రత్యేకంగా ఎటువంటి శిలీంద్రనాశినులను సిఫార్స్ చేయడం కష్టం.

నీటిలో కరిగే గంధకం (3గ్రా/లీ), హెక్సాకోనజోల్ట్ ట్రైఫ్లుమిజోల్, మైక్లోబ్యూటనిల్ ఆధారిత శిలీంద్రనాశినులు (అన్నీ ఒక లీటర్ నీటికి 3 గ్రా/లీ 2 మిల్లీ లీటర్లు) కొన్ని పంటలలో ఫంగస్ ఎదుగుదలను తగ్గించడానికి తోడ్పడుతాయి.

**నివారణ చర్యలు**

- తెగులును నిరోధించే లేదా తట్టుకునే విత్తన రకాలను వాడండి.
- మొక్కలకు గాలి, వెలుతురు ప్రసరణ చక్కగా ఉండేలా మొక్కల మధ్యన ఎక్కువ స్థలాన్ని వదలండి.
- వ్యాధి లేదా తెగులు ఉనికి కోసం పొలాలను క్రమం తప్పకుండా పరిశీలించండి.
- మొదటిసారి మచ్చలు కనిపించిన వెంటనే వ్యాధి సోకిన ఆకులను తీసివేయండి.
- ఈ తెగులుకు గురైన మొక్కలను తాకిన తర్వాత ఆరోగ్యమైన మొక్కలను తాకకండి.
- మందపాటి ఆకులతో నేలపై వేసే రక్షణ కవచం (మల్చింగ్) బీజాంశాలు భూమి నుండి ఆకులపైకి రాకుండా కాపాడతాయి.
- కొన్ని సందర్భాలలో ఈ తెగులుకు ఆతిధ్యంఇవ్వని పంటలతో పంట మార్పిడి కూడా మంచి ఫలితాలను ఇస్తుంది.
- సమతుల్య పోషకాలతో ఎరువులను వాడండి.
- అధికమైన ఉష్ణోగ్రతల మార్పులను నివారించండి.
- పంట కోత తరువాత పొలంలో బాగా లోతుగా పూడ్చి పెట్టడానికి నేలను బాగా దున్నండి.
- పంట కోత తర్వాత మొక్కల అవశేషాల్ని తొలగించండి.

**ఉన్ని పేనుబంక**

**లక్షణాలు, ఆతిథ్యం ఇచ్చేవి :** ఈ తెగులు కీటకంద్వారా వస్తుంది. దీనికి ఆతిధ్యం ఇచ్చేవి; ఆపిల్, పియర్, చెరుకు, మొక్కజొన్న, నిమ్మజాతి, కర్రపెండలం, పుచ్చకాయ, కందులు.

తెల్లవెంట్రుకలు కలిగిన కీటకాలు మొగ్గలు, కొమ్మలు, రెమ్మలు, చిగుర్లు, వేర్లను కూడా తినడం చూడవచ్చు. ఇవి తినడం వలన వంకర తిరిగిన ఆకులు, పసుపురంగు ఆకులు, పేలవమైన పెరుగుదల, కొమ్మల డైబ్యాక్ వంటి లక్షణాలు కలుగుతాయి. ఇవి తిన్న ప్రాంతాల వద్ద తెల్లని మెత్తటి పదార్ధం, తేనెబంక కనిపిస్తాయి. బెరడుపైన, రెమ్మలపైన క్యాంకర్లు, వాపు వృద్ధి చెందడం కూడా ఒక లక్షణం. పేనుబంక భూగర్భ రూపాలు వేర్లపై కూడా దాడి చేస్తాయి, పెద్ద ముడులు ఏర్పడటానికి దారి తీస్తాయి.

నీరు, పోషకాల రవాణా సరిగా ఉండకపోవడం వలన చెట్లు పసుపు రంగులోకి మారతాయి. ఇవి తినడం వలన ఈ బుడిపెలు ప్రతి సంవత్సరానికి పెరుగుతూ ఉంటాయి. పురుగుల వలన కలిగే గాయాల వలన, తేనెబంక వలన అవకాశవాద శిలీంద్రాలు ఆకర్షించ బడి కణజాలాలను నల్లని బూజుతో కప్పేస్తాయి. ఈ తెగులు సోకిన చిన్న మొక్కలను పీకినప్పుడు భూమిలో నుండి సులభంగా వూడి వస్తాయి.

**తెగులుసోకే తీరు**

ఉన్ని అఫిడ్ ఎరియోసోమా లానిగెరం తినడం వలన ఈ లక్షణాలు సంభవిస్తాయి. చాలా ఆపిడ్స్ మాదిరిగా కాకుండా, ఇది ఆకుల నుండి కాక కాండం, చిగుర్ల నుండి కణద్రవ్యాన్ని పీల్చుకుంటుంది. ఇది తెల్లని, మందపాటి, మెత్తటి మైనపు పూత కలిగి ఉంటుంది. శీతాకాలంలో ఇది బెరడుపైన పగుళ్ళలో లేదా ముందు తిన్న ప్రాంతం చుట్టూ ఉన్న గాయాలపై జీవిస్తుంది. వసంత ఋతువులో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ ఇవి మళ్ళీ చురుకుగా మారతాయి.

సన్నని బెరడు వున్న ప్రదేశాల కోసం సక్కర్స్, లేత చిగుర్లు, కొమ్మలపైకి ఎక్కుతాయి. అక్కడ ఇవి గుంపుగా బెరడు క్రింద నుండి కణద్రవ్యాన్ని పీలుస్తాయి. చివరికి కాలనీని చుట్టే మెత్తటి వెంట్రుకలను స్రవిస్తాయి. అప్పుడు ఈ బహిరంగ గాయాలను అవకాశవాద వ్యాధికారక సూక్ష్మజీవులు ఆవాసంగా చేసుకుంటాయి. పెద్ద పురుగులు, వేసవిలో రెక్కలు పెంచి, కొత్త అతిధి మొక్కల కోసం ఎగిరిపోతాయి. పండ్ల తోటల

సమీపంలో ఉన్న ఎల్మ్ చెట్లు ఆపిల్ తోటలకు ఈ అపిడ్ వలసలను పెంచుతాయి.

**జీవ నియంత్రణ**

పేనుబంకను చంపడానికి ఇవి స్రవించిన ఉన్ని పొరలోకి పిచికారీ ద్రావణాలు చొచ్చుకుని ప్రవేశించ గలగాలి. వీటిని చెదరగొట్టడానికి పలుచగా చేసిన ఆల్కహాల్ ద్రావణాలు లేదా పురుగుమందుల సబ్బులను ఈ ఉన్ని మచ్చల మీద చల్లవచ్చు. పర్యావరణహిత నూనెలు లేదా వేప సారాన్ని కూడా (ఒక లీటర్ నీటికి 2–3 మి.లీ) చెట్లపై పిచికారీ చేయవచ్చు.

మొదటి పిచికారీ అయిన 7 రోజుల తర్వాత తిరిగి పిచికారీ అవసరం. లేస్‌వింగ్స్, లేడీబగ్స్ (ఎక్సోకోమస్ క్వాడ్రిపుస్టులాటస్), హొవర్‌ఫ్లైస్ లార్వా, పరాన్నజీవి

మరియు ఎసిటామిప్రిడ్ ఆధారిత ఫార్ములేషన్లు ఉన్నాయి.

పరాన్నజీవులు, వీటిని వేటాడే కీటకాలను చంపడం ద్వారా పేనుబంక వ్యాప్తి చెందడాన్ని ప్రోత్సహిస్తున్నందున కార్బమేట్స్, పైరిథ్రోయిడ్స్‌ను నివారించాలి.

పరాగ సంపర్కానికి సహాయపడే కీటకాలకు ప్రమాదం ఉన్నందున పూలతో ఉన్న చెట్లపై పిచికారీ చేయరాదు.

**నివారణ చర్యలు**

- అందుబాటులో ఉండే తెగులు నిరోధక రకాలను ఎంచుకోండి.
- తెగులు తీవ్రత తక్కువగా వున్నప్పుడు పురుగును బ్రష్‌తో తొలగించవచ్చు.



కందిరీగలు (అఫెలినస్ మాలి) వంటి పరాన్నజీవులు, వీటిని వేటాడి తినే కీటకాలు వీటి జనాభాను నియంత్రించడంలో సహాయపడతాయి. కృత్రిమ శరణాలయాలు కుమ్మరి పురుగుల జనాభాను పెంచుతాయి, ఉదాహరణకు ఫోర్ఫిక్యులా ఆరిక్యులరియా.

**రసాయన నియంత్రణ**

అందుబాటులో ఉంటే వీలైనంతవరకు ఎల్లప్పుడూ జీవపరమైన నియంత్రణ, నివారణ చర్యలతో కూడిన సమీకృత విధానాన్ని పాటించండి. ముందస్తుగా లేదా తెగులును గుర్తించిన తర్వాత రసాయన నియంత్రణలను వాడవచ్చు.

చికిత్స చేసిన మొక్కలను పేనుబంక పురుగులు తినకుండా ఉండటానికి ఈ చికిత్సలు ఉపయోగపడతాయి. దురదృష్టవశాత్తు అవి ప్రయోజనకరమైన కీటకాలకు కూడా హాని చేస్తాయి.

రియాక్టివ్ పిచికారీలలో డెల్టామెత్రిన్, లాంబ్డాసిహాలోత్రిన్

- మొక్కలను బలోపేతం చేయడానికి ఫోర్టిఫైయర్స్ లేదా సమతుల్య ఎరువులను వాడండి.
- పురుగుమందుల అధిక వినియోగాన్ని నివారించండి.
- ఎందుకంటే అవి ప్రయోజనకరమైన కీటకాల సంఖ్యను తగ్గిస్తాయి.
- తెగులు సోకిన లేత చిగుళ్ళను, కొమ్మలను తొలగించండి.
- పేనుబంక పురుగుల కోసం తక్కువ అనుకూలమైన పరిస్థితులను సృష్టించడానికి మొక్క మొదలు వద్ద సక్కర్లను తొలగించండి.
- వీటి ఆవాసాలను నిరుత్సాహపరిచేందుకు వాణిజ్య ప్రూనింగ్ పెయింట్‌తో పెద్ద కత్తిరింపు కోతలపై పెయింట్ వేయండి.
- ఆపిల్ చెట్ల తోటలకు దగ్గరగా ఎల్మ్ చెట్లను నాటవద్దు.

■

నేత్రదానం గురించి ప్రచారంలో ఉన్న అపోహలన్నీ అర్థంపర్థం లేనివే

# కొడిగట్టిన జీవితాలను మళ్ళీ వెలిగించారు !

**కా**లమేదైనా, ఎలాంటి పరిస్థితి ఎదురైనా తన బాగు కోసమే కొట్టుకునే ఆ గుండె ఇక ఆగిపోతుందని తెలిస్తే... తన జీవితానికి పరిమళాలు అద్దడానికి నిరంతరం




అవయవదానం చేసిన కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేస్తున్న డీఎంఈ వాణి

పరితపించే ఆ ఊపిరి ఆగిపోతుందని స్పష్టమవుతుంటే... ఎంతమందిలో ఉన్నా తననే వెతికే ఆ కళ్లు కొన్ని గంటల్లో మూత పడతాయని తెలుస్తుంటే ఎవ్వరూ తట్టుకోలేరు. భర్త దూరమైన భార్య, తనయుడిని కోల్పోయిన తండ్రి.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కడుపుకోత. ఎన్నటికీ తిరిగి పూడ్చలేని బాధ. ఇంతటి దుఃఖంలోనూ బాధితులు సరైన నిర్ణయం

> **బ్రతికుండగా రక్తదానం, బ్రెయిన్ డెత్‌లో అవయవ దానం, మరణం తరువాత కంటి దానం, శరీర దానం... తీర్మానం తీసుకోండి, సమాజానికి ఒక ఉదాహరణగా మారండి.**
>
> \- గంజి ఈశ్వర్ లింగం

తీసుకున్నారు. అవయవదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఇలాంటి కుటుంబాలను ఇటీవల గాంధీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంఈ, జీవనదాన్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎన్.వాణి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, సూపరింటెండెంట్ రాజకుమారి, జీవన్‌దాన్ రాష్ట్ర సమన్వయకర్త స్వర్ణలత, నెఫ్రాలజీ విభాగాధిపతి మంజూష తదితరులు హాజరై వారి ఔదార్యాన్ని కొనియాడారు. అవయవదానంలో దేశంలోనే తమిళనాడు మొదటి, తెలంగాణ రెండో స్థానంలో నిలుస్తున్నాయన్నారు. 2013 నుంచి 2014 జులై వరకు నిమ్స్‌లో 32 మంది, ఉస్మానియాలో 9 మంది, గాంధీలో ఒకరు మొత్తంగా 42 మందికి చెందిన అవయవాలను వారి కుటుంబసభ్యులు దానం చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా 'ఈనాడు' కొందరిని కదలించగా వారి ఆవేదనను పంచుకున్నారు.

### నా కుమారుడు 11 మందిలో కనిపిస్తున్నాడు

రెండేళ్ల కిందట నా కుమారుడు సందీప్(18) బైకుపై వస్తుంటే వెనక నుంచి కారు ఢీకొట్టింది. తలకు బలమైన గాయమైంది. బతికించాలని వైద్యులను ఎంతో వేడుకున్నాం. ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. చిన్న వయసు లోనే మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. ఆ బాధనంతా దిగ మింగుకొని అవయవదానానికి సమ్మతించాం. ఇప్పుడు మా వాడు 11 మందిలో జీవిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.



*\- శ్రీహరి, బాటసింగారం*

### ఆయన చూపిన దారిలోనే నడిచాం

నేను, నా భర్త శేఖర్(38), ముగ్గురు పిల్లలతో మా కుటుంబం సాఫీగా సాగేది. ఆయన ప్రైవేటు ఉద్యోగం చేసే వారు. ఉన్నంతలో ఆనందంగా బతుకుతుండగా అనూహ్యంగా మా జీవితాలు తలకిందులు అయ్యాయి. ఆయనకు హైబీపీ రావడంతో కుప్పకూలారు.



**నేత్రాలను మనుషుల నుంచి సేకరించగలం తప్ప ఫ్యాక్టరీలలో తయారు చేయలేం**

# నేత్రదానం చేద్దాం ... మరొకరికి చూపును ప్రసాదిద్దాం!

**ఆ**గష్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు జరుగబోయే జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను పురస్కరించుకుని, సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, యోగా గురువు మచ్చ గిరి నరహరి ఆధ్వర్యంలో, జమ్మికుంటలోని నిత్య యోగ సాధన సెంటర్లో శిక్షణ పొందుతున్న వారికి నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం అంటే మొత్తం కనుగుడ్డు తీయడం కాదని, కన్ను పైన ఉన్న పల్చని "కార్నియా" అనే పొర మాత్రమేనని, మరణించిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించకుండా ఇంటి వద్దనే తీసుకోవడం జరుగుతుందని, ఈ కార్నియా మార్పిడి కోసం 15 లక్షలకు పైగా అంధులు వేచి ఉన్నారని, కాబట్టి, మానవతా దృక్పథంతో ఆలోచించి నేత్రదానం చేసి మానవ జన్మను చరితార్థం చేసుకోవాలని కోరారు.

ఇప్పటికీ చాలామందిలో నేత్ర దానంపై అపోహలు ఉన్నాయని, నేత్రదానం చేయడం కష్టమైన పని కాదని, మనం చనిపోయిన తర్వాత కూడా మన కండ్లు మరొకరికి చూపు ప్రసాదించడానికి ఉపయోగపడుతున్నాయని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు మరణానంతరం కండ్లను దానం చేయడానికి ముందుకు మృతుడి కుటుంబ సభ్యులు రావాలని వారికి అవగాహన కల్పించడానికి మన వంతుగా ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. ఈ అవగాహన పొందిన యోగా శిష్యులు సానుకూలంగా స్పందించారు. ■

---

ఆసుపత్రికి తీసుకెళ్లగా బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు చెప్పారు. అవయవదానం గురించి నా దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పుడూ ఇతరుల బాగోగుల కోరుకునే నా భర్త మాటలు అప్పుడు గుర్తు కొచ్చాయి. వెంటనే అంగీకరించాం. నలుగురి ప్రాణాలు దక్కాయని వైద్యులు చెప్పినప్పుడు ఆనందమేసింది.

***– హేమలత, యాచారం***

**ఆ గుండె చప్పుడు మాలో వినిపిస్తోంది**

రెండేళ్ల కిందట నా భర్త సంజయ్ జైస్వాల్(57) మెట్టుగూడ నుంచి బైకుపై వస్తుంటే వెనకాల నుంచి కారు ఢీకొట్టింది. మెదడులో రక్తస్రావమైనట్లు వైద్యులు తెలిపారు. నాలుగైదు రోజుల తర్వాత ఆయన బ్రెయిన్‌డెడ్ అయినట్లు చెప్పారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచలేదు. దుఃఖాన్ని దిగమింగుకొని అవయవ దానానికి ఒప్పుకొన్నాం. గుండె, కళ్లు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతో నలుగురికి పునర్జన్మ దక్కింది. నా భర్త భౌతికంగా మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లిపోయినా... ఆయన గుండె చప్పుడు మాలో వినిపిస్తోందిప్పుడు.



***– వందనా జైస్వాల్, సికింద్రాబాద్***

**నాడు అధికారిగా సేవ... నేడు 4 కుటుంబాలకు తోవ**

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వ అధికారిగా పని చేసే మా ఆయన శ్రీనివాస్(46) రెండేళ్ల కిందట బైకుపై నుంచి కింద పడిపోయారు. తలకు తీవ్ర గాయాలవడంతో హైదరాబాద్ తరలించి చికిత్స అందించినా ఫలితం లేక పోయింది. డాక్టర్లు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. ఆ క్షణంలో మా కలలన్నీ కళ్ల ముందే కరిగిపోయినా... అవయవ దానానికి అంగీకరించాం. బతికున్నప్పుడు నా భర్త అధికారిగా చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. చనిపోతూ కూడా నాలుగు కుటుంబాలకు తోవ చూపారు.



***– రమణమ్మ, బోయిన్‌పల్లి*** ■

విషాదాశ్రువులను ఆనందబాష్పాలుగా మార్చగల శక్తి నేత్ర దానానికి ఉంది

# కరువును తట్టుకునే పద్ధతిలో పంటల సాగు!

### పొలం అంతా దున్నకుండా ప్రతి 3 అడుగులకు ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి 5 రకాల పంటల సాగు

**ఏపీ** రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) మద్దతుతో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో ఒక సరికొత్త ప్రయోగం ప్రారంభమైంది. కరువును తట్టుకునే ప్రత్యేక పద్ధతి (డ్రాట్ ప్రూఫింగ్ మోడల్)లో పంటలు సాగు జరుగుతోంది. వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, బీడు భూముల్లో కూడా ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని పలువురు చిన్న, సన్నకారు రైతులు నిరూపిస్తున్నారు.

పొలం మొత్తాన్నీ దుక్కి చేయకుండా.. ప్రతి 3 అడుగుల దూరంలో ఒక అడుగు భూమిని తవ్వి 5 రకాల పంట విత్తనాలను విత్తుతున్నారు. 2023 ఆగస్టులోప్రారంభమైన ఈ సరికొత్త పద్ధతిలో అనేక జిల్లాలకు చెందిన 56 మంది రైతులు 20 సెంట్ల నుంచి ఎకరా విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫ్ సాగు చేస్తున్నారు. ఇద్దరు రైతుల అనుభవాలతో కూడిన కథనం..




**కాలువ రాకపోయినా పంట వచ్చింది...**

పల్నాడు జిల్లా ఈపూరుకు చెందిన రైతు ఎం ఆదిలక్ష్మి ఇలా చెప్పారు.. "మాకు అరెకరం పొలం ఉంది. ఇక్కడ అందరూ మిరపే వేస్తారు. మేమూ మిరపే వేసేవాళ్లం. రెండేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం.

మిరపలో అంతరపంటలు కూడా సాగు చేశాం. సాగర్ కాలువ నుంచి ఇంజన్‌తో తోడుకొని తడి పెట్టేవాళ్లం. గత ఏడాది 7 క్వింటాళ్లు ఎండు మిరప పండింది. రూ. 50 వేల నికారాదాయం వచ్చింది. వర్షాలు లేక ఈ సంవత్సరం కాలువ ఒక్కసారే వచ్చింది. అందుకని మిరప వేయలేదు.

ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు.. కరువును తట్టుకొని పండే డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు పెట్టాం. ఈ పంటలకు ముందు మేలో నవధాన్య (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) పంటలు చల్లాం. వర్షం లేక సరిగ్గా మొలవలేదు. మళ్లీ జూలైలో వేశాం. వర్షానికి మొలిచింది. పెరిగినాక కోసి, గొడ్లకు మేతగా వాడుకున్నాం.

వరుసగా మూడేళ్లుగా నవధాన్య పంటలు వేయటం వల్ల ఉపయోగం ఏమిటంటే.. భూమి బాగా గుల్లబారింది. నవధాన్య పంటలు వేయని పక్క పొలంలోకి వెళ్లి మట్టి చేత్తో తీయాలంటే చాలా కష్టపడాలి. మా పొలంలో సులువుగానే మట్టి తీయొచ్చు.

పొలం దున్నకుండానే, 3 అడుగులకు ఒక చోట అడుగు నేలను గుల్లగా తవ్వి, గత ఏడాది అక్టోబర్ 27న 5 రకాల విత్తనాలు నాటుకున్నాం. ప్రధాన పంటగా మధ్యలో ఆముదం లేదా కందిని నాటాం. దానికి నాలుగు వైపులా చిక్కుడు, అలసంద, అనుములు, సజ్జలు విత్తుకున్నాం.

బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, విత్తన గుళికలు తయారు చేసుకొని నాటుకున్నాం. సీడ్ పెల్లెటైజేషన్ చేయటం

వల్ల భూమిలో విత్తుకున్న తర్వాత మొలక శాతం బాగుంటుంది.

ఒకవేళ వర్షం రాకపోయినా లేదా మనం నీళ్లు పెట్టటం లేటైనా ఆ విత్తనం చెడిపోకుండా ఉంటుందని పెల్లటైజేషన్ చేశాం. విత్తనం పెట్టిన కొద్ది రోజులకు తుపాను వానకు విత్తనాలు మొలిచాయి. విత్తనం పెట్టేటప్పుడు అరెకరంలో 200 కిలోల ఘనజీవామృతం వేశాం. రెండుసార్లు ద్రవ జీవామృతం పిచికారీ చేశాం. తర్వాత మరో రెండు సార్లు వాన వచ్చింది. అదే వాన సరిపోయింది.

మిరపకు ఈ పంటలకు చాలా తేడా ఉంది. మిరపకు రెండు రోజులు నీరు లేకపోతే వడపడిపోయి ఎండిపోతుంది. డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో పంటలు అలా కాదు. నీరు లేకపోయినా చాలా వరకు జీవ కళ ఉంటుంది.

అదీకాక, మేం చేసిన విత్తన గుళికలుగా చేసి వేసినందు వల్ల, భూమిలో వేసిన ఘనజీవామృతం వల్ల, ద్రవ జీవామృతం పిచికారీ వల్ల పంటలు ఎదిగాయి. ప్రధాన పంటతో పాటు పెట్టిన అనుములు, చిక్కుళ్ల వల్ల ఉపయోగం ఏమిటంటే.. ఈ తీగలు పాకి నేలపై ఎండపడకుండా కప్పి ఉంచి కాపాడటం, భూమిలో తేమ ఆరిపోకుండా కాపాడింది.

సజ్జ ద్వారా రూ. 8,000లు వచ్చాయి. సజ్జ ఇంకా తీయాల్సి ఉంది. చిక్కుళ్లు,సొర కాయలు, దోసకాయల ద్వారా మరో ఆరేడు వేలు ఆదాయం వచ్చింది. సజ్జ బాగా పెరగటంతో నీరు లేక కంది సరిగ్గా ఎదగలేదు. ఇప్పటికి అన్నీ కలిపి రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా ఆముదాలు ఒక బస్తా వరకు వస్తాయి. పనులు మేమే చేసుకుంటాం. ఖాళీ ఉన్న రోజుల్లో కూలికి వెళ్తాం. బెట్టను తట్టుకొని పంట పండించుకోవచ్చని, ఎంతో కొంత దిగుబడి వస్తుందని నాకైతే నమ్మకం కుదిరింది..”

***– ఎం.ఆదిలక్ష్మి (8309118867)***

**బీడులోనూ పంటలు..**

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కపట్రాళ్ళ గ్రామానికి చెందిన రంగస్వామి బిఎస్సీ బీఈడీ చదువుకొని తమ రెండెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఒక ఎకరంలో సపోట, మామిడి చెట్లు ఉన్నాయి. మరో ఎకరంలో టమాట, మిర్చి, వంగ, గోరుచిక్కుడు పంటలను బోరు నీటితో సాగు చేశారు. రెండో పంటగా వేరుశనగ, కంది, ముల్లంగి తదితర పంటలు వేశారు. రెండెకరాల్లో సగటున ఏడాదికి రూ. లక్షా 70 వేల వరకు నికరాదాయం పొందుతున్నట్లు తెలిపారు.

సపోట, మామిడి తోటలో మూడు ఏళ్లుగా దుక్కి చేయని 30 సెంట్ల విస్తీర్ణంలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌లో 2023 డిసెంబర్‌లో ప్రయోగాత్మకంగా సజ్జ, గోరు చిక్కుడు, అనుములు, అలసంద, కంది, ఆముదం పంటలను సాగు చేశారు. 3 అడుగుల దూరంలో ఒక అడుగు విస్తీర్ణంలో తవ్వి, ఘనజీవామృతం వేసి విత్తనాలు విత్తారు. మామిడి ఆకులతో ఆచ్ఛాదన చేశారు. వారానికోసారి బక్కెట్లతో పాదికి 2, 3 లీటర్ల నీరు పోశారు. మూడు నెలల వ్యవధిలో అలసంద, అనుములు అమ్మితే రూ. 2 వేల దాకా ఆదాయం వచ్చింది.పశుగ్రాసం రూపంలో మరో రూ. 3 వేల ఆదాయం వచ్చింది. రూ. 2 వేల గోరుచిక్కుళ్లు పండాయి. తమ ఇంటి కోసం, బంధువులకు వినియోగించారు. సజ్జ పక్షులు తిన్నాయి. కంది, ఆముదం పంటలు కోయాల్సి ఉంది.

పంటలకు నీరు పోస్తున్నందున మొక్కల మధ్యన 3 అడుగుల ఖాళీలో గడ్డి పెరుగుతోంది. ఆ గడ్డిని కోసి ఆవులు, గేదెలకు వేస్తున్నారు. డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ పంటలతో వదిలేసిన భూమిని దుక్కి చేయకుండానే.. పంటలు పెట్టుకునే చోట తవ్వి విత్తనాలు పెట్టుకొని తిరిగి సాగులోకి తెచ్చు కోవచ్చని, ఎంతో కొంత పంట దిగుబడి తీసుకోవచ్చని రంగస్వామి అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయం వల్ల రంగస్వామి పొలంలో వానపాముల సంఖ్య పెరిగింది. నేల గుల్లబారి మృదువుగా తయారవడంతో వర్షాలు తగ్గినా పంట పెరుగుదల బాగా కనిపిస్తోంది. రంగస్వామి ప్రకృతి వ్యవసాయం చూసి రంగస్వామి (88869 60609) తండ్రి కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం విశేషం.

– సాక్షి సౌజన్యంతో

■

# అన్నదాత సుఖీభవ పథకానికి ఇలా దరఖాస్తు చేయండి

అన్నదాత సుఖీభవ పథకం కింద కొత్త ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 20,000 కోసం ఆంధ్రప్రదేశ్‌లోని రైతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే పూర్తి ఊపులో ఉంది. ఇంక మూడు నెలల్లో ముగుస్తుంది. ఈ దశలో ఏపీ ప్రభుత్వం నుండి కీలకమైన సమాచారం వెలువడింది. ఏపీ ప్రభుత్వం 'సూపర్ సిక్స్' కార్యక్రమాలలో భాగంగా, పేద రైతులకు అన్నదాత సుఖీభవ పథకం, కింద సంవత్సరానికి రూ. 20,000 ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన మంత్రి కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 6,000 విరాళంగా అందించగా, మిగిలిన రూ. 14,000 రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో పంపిణీ చేస్తుంది. జూన్ 12న ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండు నెలలు గడుస్తుండడంతో రుణమాఫీ కోసం రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Annadata Sukhibhava Payment Status

**అన్నదాత సుఖీభవ పథకం కోసం కొత్త పోర్టల్**

అన్నదాత సుఖీభవ పథకం కోసం ఏపీ ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేస్తోంది. త్వరలో అమలులోకి రానుంది. ఈ పథకాన్ని త్వరలో అమలు చేయాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఇది తెలియజేస్తోంది. సుమారు 5.5 మిలియన్ల మంది రైతులు ఈ చొరవ నుండి ప్రయోజనం పొందుతారని అంచనా.

ప్రస్తుతం, పోర్టల్ (https://annadathasukhibhava.ap.gov.in/index.html) లో స్కీమ్‌లు, పాలసీలు, డ్యాష్‌బోర్డ్ మరియు చెక్ యువర్ స్టేటస్ వంటి ఆప్షన్‌లతో పాటు సీఎం చంద్రబాబునాయుడు మరియు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఫోటోలు ఉన్నాయి.

రూ. 20,000 మద్దతును పొందాలనుకునే రైతులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో డ్యాష్‌బోర్డ్ విభాగంలో వివరణాత్మక సూచనలు ఉంటాయి. "మీ స్థితిని తనిఖీ చేయండి" ఎంపిక దరఖాస్తుదారులు తమ దరఖాస్తుల ఆమోద స్థితిని ట్రాక్ చేయడానికి అనుమతిస్తుంది.

**దరఖాస్తు ప్రక్రియ**

అర్హులైన రైతులు, ఇప్పటికే కేంద్ర పీఎం కిసాన్ పథకం (పిఎం కిసాన్ స్కీమ్) నుండి రూ. 6,000 అందుకుంటున్నారు. వారు అన్నదాత సుఖీభవకు అర్హత సాధించవచ్చు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీమ్ కోసం నిర్దిష్ట డేటాను కంపైల్ చేయాల్సి ఉంటుంది, అందుకే అంకితమైన పోర్టల్.

**దరఖాస్తు చేయడానికి దశలు:**

- అన్నదాత సుఖీభవ పోర్టల్‌ని సందర్శించండి.
- పేరు, మొబైల్ నంబర్, చిరునామా, ఆధార్ నంబర్, భూమి పాస్‌బుక్ మరియు బ్యాంక్ ఖాతా నంబర్ వంటి
- వివరాలతో దరఖాస్తు ఫారమ్‌ను పూరించండి.
- రుజువుగా సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయండి.
- ప్రభుత్వ సమీక్ష కోసం దరఖాస్తును సమర్పించండి.
- ఆమోదం పొందిన తర్వాత నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయి. "నో యువర్ స్టేటస్" ఆప్షన్ అప్లికేషన్ స్టేటస్ మరియు ఫండ్ డిస్బర్స్‌మెంట్ వివరాలపై అప్‌డేట్‌లను అందిస్తుంది.
- మీసేవా కేంద్రాల్లోనూ సేవలు అందుబాటులో ఉంటాయి.

(నీడ్స్ ఆఫ్ తెలుగు వెబ్‌సైట్ సౌజన్యంతో)

■

నేత్ర దానం ప్రకటిస్తున్న వారిలో నూటికి ఇద్దరు ముగ్గురు మాత్రమే వాస్తవంగా నేత్రదాతలు అవుతున్నారు

# ఆడపిల్ల పెళ్ళి నాటికి 70 లక్షలు అందించే సుకన్య సమృద్ధి

**కేం**ద్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న గొప్ప పథకాల్లో సుకన్య సమృద్ధి యోజన అనేది ముందువరుసలో ఉంటుంది. ప్రస్తుతం జులై– సెప్టెంబర్ త్రైమాసికానికి దీంట్లో వడ్డీ రేటు 8.20 శాతంగా ఉంది. చిన్న వయసులోనే ఆడపిల్ల పేరిట అకౌంట్ తెరిచి కనీస పెట్టుబడితో దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో సంపద సృష్టించుకోవచ్చు. పాప పెళ్లి వయసు వచ్చే సరికి లక్షల్లో అందుకోవచ్చు. ఈ స్కీంలో ఎంత ఇన్వెస్ట్ చేస్తే ఎంత వస్తుందనేది చూద్దాం.

కేంద్ర ప్రభుత్వం.. దాదాపు అన్ని వర్గాల వారి కోసం, వారి సంక్షేమానికి కొత్త కొత్త పథకాల్ని ఎప్పటికప్పుడు తెస్తూనే ఉంది. ఈ క్రమం లోనే 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన కొంతకాలానికే ''బేటీ బచావో బేటీ పడావో'' క్యాంపెయిన్‌లో భాగంగా.. "సుకన్య సమృద్ధి అకౌంట్" అనే కొత్త స్కీమ్ తీసుకొచ్చింది.

ఇది కేవలం ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే. చిన్న వయసులోనే ఆడపిల్లల పేరుతో అకౌంట్ ఓపెన్ చేసేలా.. దీర్ఘకాలంలో వారు పెద్ద మొత్తంలో సంపద సృష్టించుకోవాలన్న ఉద్దేశం తో ఈ పథకం లాంఛ్ అయింది. దీంట్లో చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టొచ్చు. లాంగ్ టర్మ్‌లో భారీగా ఆర్జించవచ్చు.

చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో వడ్డీ రేట్లు దీంట్లోనే ఎక్కువ. ఇంకా ఈ స్కీంలో పెట్టుబడులతో పాత పన్ను విధానం ప్రకారం.. సెక్షన్ 80% ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఏటా రూ. 1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు.

ఈ పోస్టాఫీస్ పథకాల వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం ప్రతి 3 నెలలకు ఒకసారి సవరిస్తుంటుంది. గతేడాది ఈ వడ్డీ రేట్లను పెంచగా.. తర్వాత స్థిరంగానే ఉంచుతోంది. ప్రస్తుతం దీంట్లో వడ్డీ రేటు 8.20 శాతంగా ఉంది. సీనియర్ సిటిజెన్ సేవింగ్స్ స్కీమ్‌తో పాటుగా దీంట్లోనే అత్యధిక వడ్డీ వస్తుంది. ఈ వడ్డీ రేటు సెప్టెంబర్ వరకు ఉంటుంది.

ఈ స్కీం వివరాలకు వస్తే ఏడాదికి కనీసం రూ. 250 తో చేరొచ్చు. గరిష్టంగా ఆర్థిక సంవత్సరంలో రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. మధ్యలో మీరు ఈ రేంజ్‌లో ఎంత మొత్తంలో అయినా డిపాజిట్ చేసుకోవచ్చు. ఇలా వరుసగా 15 సంవత్సరాలు డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఆడపిల్లకు 10 సంవత్సరాలలోపే ఈ స్కీంలో చేరాలి. వారి పేరిట తల్లిదండ్రులు లేదా గార్డియెన్ అకౌంట్ తెరవొచ్చు. పోస్టాఫీస్ లేదా ఏదైనా బ్యాంకు కు వెళ్లి ప్రాసెస్ చేసుకోవచ్చు. ఒక కుటుంబం లో గరిష్టంగా ఇద్దరు ఆడపిల్లలకు ఛాన్స్ ఉంటుంది. కవలలు లేదా ట్రిప్లెట్స్ ఆడపిల్లలు అయి నప్పుడు 3 ఖాతాలు తెరిచేం దుకు అవకాశం ఉంటుంది.

**నిబంధనలలో మార్పులు**

ప్రజల నుంచి మంచి స్పందన పొందుతున్న సుకన్య సమృద్ధి యోజన నిబంధనలను మార్చుతూ కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసింది. వివరాల్లోకి వెళితే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక వ్యవహారాల విభాగం ఒక సర్క్యులర్ను విడుదల చేసింది. సర్క్యులర్ ప్రకారం కొత్తగా ఆరు నిబంధనలను జారీ చేసింది. ఈ నియమాలు నేషనల్ సేవింగ్స్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలకు సంబంధించినది. దీంతో చిన్న పొదుపు పథకాల్లో పెట్టుబడులను కలిగి ఉన్న ఇన్వెస్టర్లు మారిన నిబంధనల గురించి తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉన్నారు.

చట్టబద్ధమైన సంరక్షకులు కాకుండా ఇతర వ్యక్తుల

ఐ బ్యాంకులు, ఐ డొనేషన్ సెంటర్లు 24 గంటలు సేవలు అందిస్తాయి

సంరక్షకత్వంలో ఖాతాలు తెరిచినట్లయితే.. చట్టం ప్రకారం అర్హులైన వ్యక్తికి అంటే సహజ సంరక్షకుడికి (సజీవంగా ఉన్న తల్లిదండ్రులు) లేదా చట్టపరమైన సంరక్షకుడికి బదిలీ చేయబడుతుంది. స్కీమ్ ప్రకారం 2019లోని పేరా 3ని ఉల్లంఘించి ఒక కుటుంబంలో రెండు కంటే ఎక్కువ ఖాతాలు తెరిచినట్లయితే.. వాటిని పథకం మార్గదర్శకాలను ఉల్లంఘించి తెరిచిన ఖాతాలుగా పరిగణించడం ద్వారా సక్రమంగా లేని ఖాతాలు మూసివేయబడనున్నాయి

ఎవరైనా వ్యక్తి కుమార్తెల కోసం ప్రారంభించిన సుకన్య సమృద్ధి యోజన కింద డిపాజిట్లపై 8.2 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ స్కీమ్ పెట్టుబడులు సెక్షన్ 80 కింద పన్ను నుంచి పూర్తిగా పన్ను మినహాయింపు పొందేందుకు అర్హమైనవి. స్కీమ్ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 250 రూపాయల నుంచి గరిష్ఠంగా 1.50 లక్షల రూపాయల వరకు ఇన్వెస్ట్ చేసేందుకు వెసులుబాటు ఉంది. అయితే ఏదానా ఆర్థిక సంవత్సరంలో కనీస మొత్తాన్ని డిపాజిట్ చేయటంలో విఫలమైతే రూ.50 జరిమానాగా విధించబడుతుందని పెట్టుబడిదారులు గుర్తుంచుకోవాలి.

ఖాతా తెరిచిన తేదీ నుంచి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఖాతా మెచ్యూర్ అవుతుంది. ఒకవేళ ఖాతాదారుడు 21 సంవత్సరాల వ్యవధి పూర్తయ్యేలోపు వివాహం చేసుకున్నట్లయితే.. వారి వివాహ తేదీ తర్వాత ఖాతాను ఆపరేట్ చేయడానికి అనుమతించబడదు. ఉన్నత విద్య, వివాహ ప్రయోజనం కోసం ఖాతాదారు అవసరాలను తీర్చడానికి పాక్షిక ఉపసంహరణ సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇందులో కల్పించింది. ప్రస్తుతం దేశంలో ఉన్న అనేక సురక్షితమైన పొదుపు పథకాల్లో ఉత్తమ రాబడులను ఇస్తున్న స్కీమ్‌గా సుకన్య సమృద్ధి యోజన గుర్తింపు పొందటంతో పాటు భారీగా ప్రజాధరణను అందుకుంటోంది.

**సుకన్య సమృద్ధి యోజన బదిలీ ఇలా**

సుకన్య సమృద్ధి యోజన(ఎస్ఎస్‌వై) పథకాన్ని బ్యాంకు నుండి పోస్టాఫీస్‌కు బదిలీ చేసుకోవచ్చు. ఆడపిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకం ఎస్ఎస్‌వై. పదేళ్ల లోపు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఈ ఖాతాను పోస్టాఫీస్ లేదా నిర్దిష్ట బ్యాంకుల్లో తెరువవచ్చు. అలాగే బ్యాంకు నుండి పోస్టాఫీస్‌కు లేదా పోస్టాఫీస్ నుండి బ్యాంకుకు లేదా బ్యాంకు నుండి మరో బ్యాంకుకు కూడా బదిలీ చేసుకోవచ్చు

ఒక పోస్టాఫీస్ నుండి మరో పోస్టాఫీస్‌కు ఖాతాను ఉచితంగా బదిలీ చేసుకోవచ్చు. ఒకవేళ పోస్టాఫీస్ నుండి బ్యాంకుకు బదిలీ చేసుకుంటే 100 రూపాయల ఛార్జీ ఉంటుంది. ఏడాదిలో ఒకసారి ఖాతాను బదిలీ చేసుకునే వెసులుబాటు ఉంది. బ్యాంకు నుండి పోస్టాఫీస్‌కు ఖాతాను బదిలీ చేసుకోవడానికి ఓ ప్రాసెస్ ఉంటుంది. మొదట మీరు ఖాతాను బదిలీ చేసుకోవడానికి ఫామ్ ఫిల్-అప్ చేయాలి.

ఖాతా బదిలీ కోసం ముందుగా మీరు ఖాతా తెరిచిన బ్యాంకు బ్రాంచీ లేదా పోస్టాఫీస్‌కు వెళ్లి ట్రాన్స్‌ఫామ్ కోసం విజ్ఞప్తి చేయాలి. బ్యాంకు లేదా పోస్టాఫీస్ మీకు బదిలీ ఫామ్ ఇస్తారు. దీనిని పూర్తి చేయాలి. బదిలీ ఫామ్ పూరించేటప్పుడు ఖాతా బదిలీ చేయబోయే బ్యాంకు లేదా పోస్టాఫీస్ పేరు, చిరునామా తప్పనిసరిగా అభ్యర్థన ఫారమ్‌లో వెల్లడించాలి. తర్వాత ఈ ఫారమ్‌తో పాటు పాస్‌బుక్‌ను సమర్పించాలి. ఖాతా బదిలీ కోసం ఒరిజినల్ పాస్‌బుక్‌ను అందచేయాలి. ప్రస్తుత బ్యాంకు లేదా పోస్టాఫీస్ మీరు సమర్పించిన ఫామ్‌ను, ఇతర పత్రాలను ధృవీకరించి, ఖాతా బదిలీ ప్రాసెస్‌ను పూర్తి చేస్తుంది.

బ్యాంకులో ఖాతాను మూసివేసి, సంబంధిత అన్ని పత్రాలను కొత్త అడ్రస్‌కు పంపిస్తుంది. కొన్ని సందర్భాల్లో కస్టమర్‌కు అందిస్తారు. పత్రాలు వచ్చాక కొత్త అడ్రస్‌లో ఖాతా తెరిచి సంబంధిత పాస్‌బుక్ ఖాతాదారునికి అందిస్తుంది. కొన్ని బ్యాంకులు కొత్త దరఖాస్తు ఫామ్‌తో పాటు కేవైసీ పత్రాలను కోరుతాయి. సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరవడానికి కావాల్సిన పత్రాలు ఖాతాదారుని ఫోటోగ్రాఫ్, గార్డియన్ ఆధార్ కార్డు, గార్డియన్ పాన్ కార్డు, పాప పుట్టిన తేదీ పత్రం, కేవైసీ పత్రాలు అవసరం.

■

ప్రతిఫలాపేక్ష లేని దాన్నే దానమంటారు. అందుకు నేత్రదానం చక్కటి ఉదాహరణ

# సాగుభూమిలో విద్యుత్ స్తంభం వుంటే కొత్త నిబంధన

**వ్య**వసాయ భూమిలో విద్యుత్‌స్తంభాలున్న రైతులు ఇప్పుడు కొత్త ప్రభుత్వ చొరవ నుండి ప్రయోజనం పొందవచ్చు. విద్యుత్ సంస్థ నుండి రూ.10,000 సబ్సిడిని అందుకుంటారు. దేశవ్యాప్తంగా రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి మరియు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఇది భాగం.

**రైతులకు ఉచిత విద్యుత్ పథకం**

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సహా పలు పథకాలను అమలు చేస్తోంది. అయితే, చాలా మంది రైతులకు ఈ ప్రయోజనాల గురించి తెలియదు. ట్రాన్స్‌ఫార్మర్ సబ్సిడిని అందించడంపై దృష్టి పెడుతుంది, వారి భూమిపై డిస్ట్రిబ్యూషన్ పాయింట్లు (డిపి) లేదా స్తంభాలు వంటి విద్యుత్ మౌలిక సదుపాయాలను కలిగి ఉన్న రైతులను ఆదుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది.



**ట్రాన్స్ ఫార్మర్ సబ్సిడీ వివరాలు**

అర్హత : తమ వ్యవసాయ భూమిలో డిస్ట్రిబ్యూషన్ పాయింట్ (డిపి) లేదా విద్యుత్ స్తంభం ఉన్న రైతులు.

సబ్సిడీ మొత్తం: అర్హత కలిగిన రైతులు విద్యుత్ సంస్థ నుండి రూ. 10,000 సబ్సిడిని పొందవచ్చు.

విద్యుత్ చట్టం, 2003 : విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 57 ప్రకారం, వారి భూమిలో ఇటువంటి మౌలిక సదుపాయాలు ఉన్న రైతులు వివిధ ప్రయోజనాలకు అర్హులు. పరిహారం మరియు మరమ్మత్తు కాలపట్టికలు.

ఆలస్యానికి పరిహారం : విద్యుత్ బోర్డు (కెఇబి) రైతు యొక్క వ్రాతపూర్వక దరఖాస్తును 30 రోజుల్లోగా పరిష్కరించకపోతే, రైతు వారానికి రూ. 100 పరిహారం పొందేందుకు అర్హులు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు: ట్రాన్స్‌ఫార్మర్లో ఏదైనా సమస్య ఉంటే, కంపెనీ దానిని 48 గంటల్లో రిపేర్ చేయాల్సి ఉంటుంది.

**అదనపు ఆర్థిక ప్రయోజనాలు**

- నెలవారీ చెల్లింపులు : స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ (ఎంఎస్ఇబి) నుండి డీపీలు, స్తంభాలు మరియు సంబంధిత మౌలిక సదుపాయాల కోసం రైతులు నెలకు రూ. 2,000 నుండి రూ. 5,000 వరకు పొందవచ్చు.
- లీజు ఒప్పందం : ఒక విద్యుత్ సంస్థ వివిధ పొలాల మీదుగా విద్యుత్తును ప్రసారం చేయాలనుకుంటే, స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, డీపీలు మరియు స్తంభాలను వ్యవస్థాపించడానికి రైతుతో తప్పనిసరిగా లీజు ఒప్పందంపై సంతకం చేయాలి. కౌలు ఒప్పందం ప్రకారం కంపెనీ రైతుకు రూ. 5,000 నుండి రూ. 10,000 వరకు చెల్లించాలి.



- ఇప్పటికే తమ భూమిలో విద్యుత్ స్తంభాలు ఉన్న రైతులు తమ కౌలు చెల్లింపులు అందకపోతే అభ్యంతరం తెలియజేయాలని సూచించారు. అలా చేయడంలో వైఫల్యం కౌలు ప్రయోజనాలను కోల్పోయే అవకాశం ఉంది. ■

# ఈ 7 కేసుల్లో కుమార్తెలకు ఆస్తిలో వాటా ఉండదు

**హిం**దూ వారసత్వ చట్టం, 2005లోని నిబంధనలు ఉన్నప్పటికీ, కుమార్తెలు పూర్వీకుల లేదా కుటుంబ ఆస్తిలో వాటాను పొందలేని కొన్ని షరతులను భారత సుప్రీంకోర్టు మరియు వివిధ చట్టపరమైన వివరణలు ఏర్పాటు చేశాయి. ఇక్కడ కుమార్తెలు వారసత్వం నుండి మినహాయించబడే కొన్ని కీలక దృశ్యాలు ఉన్నాయి.

**స్వీయ-ఆర్జిత ఆస్తి**

ఆస్తిని తండ్రి స్వయంగా సంపాదించినట్లయితే, దానిని అతను కోరుకున్న విధంగా పారవేసేందుకు అతనికి సంపూర్ణ హక్కు ఉంటుంది. అతను ఎంచుకునే ఎవరికైనా వీలునామా ద్వారా విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం లేదా విరాళంగా ఇవ్వడం ఇందులో ఉంటుంది. కుమార్తెలు (మరియు కుమారులు) అటువంటి ఆస్తిపై చట్టపరమైన దావాను కలిగి ఉండరు, అది వారికి వీలునామా చేయబడితే తప్ప.

**2005కి ముందు పంపిణీ చేయబడిన ఆస్తి**


హిందూ వారసత్వ (అమెండ్ మెంట్) చట్టం, 2005 అమల్లోకి రాకముందే ఆస్తి వారసుల మధ్య పంపిణీ చేయబడితే, కుమార్తెలకు దానిపై క్లెయిమ్ ఉండకపోవచ్చు. కుమార్తెలకు సమాన హక్కులను కల్పించే సవరణ సాధారణంగా 2005కి ముందు చేసిన ఆస్తి విభజనలకు పూర్వకాలంలో వర్తించదు.

**హక్కుల విడుదల**

ఒక కుమార్తె స్వచ్ఛందంగా విడుదల లేదా ఉప సంహరణ దస్తావేజుపై సంతకం చేసి, ఆస్తిలో తన వాటాకు బదులుగా డబ్బు లేదా ఇతర పరిశీలనలను అంగీకరించ దానికి అంగీకరిస్తే, ఆమె ఆస్తిపై తన దావాను కోల్పోవచ్చు. అయితే, అటువంటి పత్రం ఒత్తిడితో లేదా తప్పుగా సూచించి సంతకం చేయబడితే, ఆమె దానిని చట్టపరంగా సవాలు చేయవచ్చు.

**బహుమతి పొందిన ఆస్తి**

ఒక ఆస్తిని పూర్వీకులు మరొక వ్యక్తికి బహుమతిగా ఇచ్చినట్లయితే మరియు గిఫ్ట్ డీడ్ చట్టబద్ధంగా చెల్లుబాటు అయ్యేది మరియు డాక్యుమెంట్ చేయబడినట్లయితే, కుమార్తెలు సాధారణంగా అలాంటి బహుమతి పొందిన ఆస్తిలో వాటాను క్లెయిమ్ చేయలేరు. బహుమతులు యాజమాన్యం యొక్క స్వచ్ఛంద బదిలీగా పరిగణించ బడతాయి మరియు సరిగ్గా అమలు చేయబడినట్లయితే కట్టుబడి ఉంటాయి.




**వీలునామా**

ఆస్తి పంపిణీని పేర్కొంటూ చెల్లుబాటు అయ్యే వీలునామా ఉనికిలో ఉన్నట్లయితే, దాని నిబంధనలకు ప్రాధాన్యత ఉంటుంది. వీలునామాలో కుమార్తె చేర్చబడక పోతే, వీలునామా కోర్టులో విజయవంతంగా సవాలు చేయబడితే తప్ప ఆమె సాధారణంగా వాటాను క్లెయిమ్ చేయదు.

# బ్యాంక్ డిపాజిట్ల మొత్తం సొమ్ములో మహిళల వాటా 21%

దేశంలోని మొత్తం బ్యాంక్ ఖాతాల్లో మహిళలవి 36 శాతమని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజా నివేదిక వెల్లడించింది. కానీ, దేశంలోని బ్యాంక్ ఖాతాల్లో జమైన మొత్తం డిపాజిట్లలో మహిళా ఖాతాదారుల వాటా 21 శాతమేనని తెలిపింది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం.. 2023 మార్చి నాటికి దేశంలో మొత్తం 252 కోట్ల బ్యాంక్ ఖాతాలుండగా.. అందులో 91.77 కోట్ల ఖాతాలు (36.4 శాతం) ఖాతాలు మహిళలవి.

కాగా, మొత్తం బ్యాంక్ అకౌంట్లలోని రూ.187 లక్షల కోట్ల సొమ్ములో మహిళల ఖాతాదారులకు చెందినవి రూ.39 లక్షల కోట్లు. అనగా 20.8 శాతానికి సమానం.

మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, మహిళలు, పురుషుల బ్యాంక్ డిపాజిట్ల సొమ్ములో అంతరం గ్రామాల్లో పోలిస్తే, మెట్రో నగరాల్లోనే అధికం. మెట్రో నగరాలకు చెందిన బ్యాంక్ బ్రాంచ్లోని మొత్తం డిపాజిట్లలో కేవలం 16.5 శాతం (రూ.1.9 లక్షల కోట్లు) మాత్రమే మహిళవి.

కాగా, గ్రామీణ ప్రాంతాల బ్రాంచ్లో ఈ వాటా 30 శాతం (రూ.5.91 లక్షల కోట్లు)గా ఉంది. గ్రామాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో అధిక శాతం జన్ ధన్ ఖాతాలు మహిళల పేరిట ఉండటం ఇందుకు కారణం కావచ్చని పేర్కొంది. ప్రతి నలుగురు బ్యాంక్ ఉద్యోగుల్లో ఒకరు మహిళని ఎన్ఎస్ఓ నివేదిక వెల్లడించింది.

బ్యాంక్లోని మహిళా ఉద్యోగుల సంఖ్య 4.41 లక్షలుగా ఉండగా.. 13.2 లక్షల మంది పురుష ఉద్యోగులు పనిచేస్తున్నారు. 34,879 మంది మహిళా ఉద్యోగులు సీనియర్ మేనేజ్మెంట్ పదవుల్లో ఉండగా.. 1.86 లక్షల మంది పురుష ఉద్యోగులు ఈ పొజిషన్లో ఉన్నట్లు ఎన్ఎస్ఓ తెలిపింది. ■




**స్థిరపడిన ఆస్తులు**

నమ్మకంతో స్థిరపడిన లేదా చట్టబద్ధంగా మరొక పార్టీకి బదిలీ చేయబడిన ఆస్తులపై కుమార్తెలు క్లెయిమ్ చేయలేరు. అన్ని చట్టపరమైన విధానాలను అనుసరించినట్లయితే అటువంటి సెటిల్మెంట్స్ నిబంధనలు సాధారణంగా కట్టుబడి ఉంటాయి.

**2005కి ముందు విభజన**

2005 సవరణకు ముందు పూర్వీకుల ఆస్తి విభజన జరిగి, చట్టబద్ధంగా అమలు చేయబడి, నమోదు చేయబడితే, సవరణకు పూర్వపు దరఖాస్తు లేనందున కుమార్తెలు ఆ ఆస్తిలో వాటాను క్లెయిమ్ చేయలేరు.

సుప్రీంకోర్టు హిందూ వారసత్వ (అమెండ్మెంట్) చట్టం, 2005 భారతదేశంలో ఆస్తి హక్కులలో గణనీయమైన సమాన హక్కులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ మినహాయింపులు సాంప్రదాయ పద్ధతులు మరియు నిర్దిష్ట చట్టపరమైన పరిస్థితులు ఈ చట్టం యొక్క అన్వయాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో వివరిస్తాయి. ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టపరమైన వివాదాలు సంక్లిష్టంగా ఉంటాయి మరియు విజయవంతంగా నావిగేట్ చేయడానికి తరచుగా వృత్తిపరమైన న్యాయ సలహా అవసరం.

**– నీడ్స్ అఫ్ తెలుగు వెబ్సైట్ సౌజన్యతో** ■

నేత్ర దానం చేస్తే వచ్చే జన్మలో కళ్ళు లేకుండా పుడతారు అన్నది అపోహ

# 5 ఎకరాలు మించని రైతులకు కేంద్ర 'ఆశీర్వాదం' !

**వ్య**వసాయ రంగం మన దేశ ప్రగతికి వెన్నెముక. దీనిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాభివృద్ధికి, రైతులకు సహాయం చేయడానికి అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. ఇన్ని ప్రయత్నాలు చేసినా చాలా మంది రైతులు ఈ పథకాల ద్వారా పూర్తి స్థాయిలో లబ్ధి పొందలేక పోతున్నారు.

కేంద్ర ప్రభుత్వ తాజా చొరవ 5 ఎకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమి ఉన్న రైతులకు మరో శుభ వార్తను అందించింది.

**కిసాన్ ఆశీర్వాద్ పథకం**

భూమి పరిమాణం ఆధారంగా ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం "కిసాన్ ఆశీర్వాద్" పథకాన్ని తీసుకు వచ్చింది. ఈ పథకం కింద, 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ. 25,000, 4 ఎకరాలు ఉన్న రైతులకు రూ.20,000 , 2 ఎకరాలు ఉన్న రైతులకు రూ.5,000 నుండి రూ. 10,000 అందుతుంది .

అదనంగా, 5 ఎకరాల భూమివున్న రైతులు కూడా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద సంవత్సరానికి రూ. 6,000 పొందడానికి అర్హులు. ఈ రకంగా వారికి మొత్తం రూ.31,000 ప్రయోజనం లభిస్తుంది.

**రాష్ట్రాల అంతటా అమలు**

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన) దేశవ్యాప్తంగా రైతులకు రూ.6,000 వార్షిక సహాయాన్ని అందిస్తుంది.

జార్ఖండ్ రాష్ట్రం తన రైతులకు వారి వ్యవసాయ భూమి పరిమాణం ఆధారంగా అదనంగా రూ.25,000 వార్షిక గ్రాంట్ అందించడం ద్వారా ఒక అడుగు ముందుకు వేసింది.

**అవసరమైన పత్రాలు**

ఈ ప్రయోజనాలను పొందడానికి, రైతులు ఈ క్రింది పత్రాలను, సమాచారాన్ని సమర్పించాలి:

ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు , రెవెన్యూ శాఖ సర్టిఫికేట్ , భూమి పత్రాలు , పహాణి పత్రం, భూమి పన్ను చెల్లింపు రసీదు, మొబైల్ నంబర్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మొదలగునవి.




**అన్ని రాష్ట్రాలకు విస్తరణ**

ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలో అమలుచేస్తున్న కిసాన్ ఆశీర్వాద్ పథకాన్ని అన్ని రాష్ట్రాలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విస్తరణ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, సమగ్ర వ్యవసాయ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. ఈ రాష్ట్రాల్లో ఆశీర్వాద్ యోజన అమలు కాలపరిమితితో కూడుకున్నప్పటికీ, ఒకసారి అమలులోకి వస్తే, అది రైతులకు గణనీయమైన ప్రయోజనాలను తెస్తుంది.

**– నీడ్స్ ఆఫ్ తెలుగు వెబ్‌సైట్ సౌజన్యంతో**

■

కోరుకున్నట్టు జీవితం నడవకపోవచ్చు , కాని జీవించే అనుక్షణం ఉదాత్తంగా నడవగలిగితే చాలు

# పొలానికి కంచె వేసుకోవడానికీ ఒక పథకం!

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా.. కోతులు, ఆవులు, ఎద్దులు, జింకల కారణంగా పంటలు పాడవుతూనే ఉంటాయి. విచ్చలవిడిగా పొలాల్లో తిరుగుతూ పంటను పాడు చేస్తుంటాయి.

అయితే రైతులు తమ పంటను కాపాడుకునే లక్ష్యంతో రాజస్థాన్ ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది.



తారాబంది పథకం ద్వారా... రైతులు తమ పొలాలు, తోటల చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి గ్రాంట్లను పొందవచ్చు.

ఈ పథకం ద్వారా మొత్తం 2,555 మంది రైతులు తమ పొలాలకు ఫెన్సింగ్ కోసం గ్రాంట్స్ పొందుతారు. రైతులు తమ పొలానికి ఫెన్సింగ్ వేయడానికి ఎంత ఖర్చు అవుతుందో అందులో 90 శాతం వరకు సబ్సిడీని పొందచవ్చు. ఒకవేళ ఫెన్సింగ్ ఖర్చు రూ. 20,000 అయితే.. అందులో రూ. 18 వేలు మీకు రీయింబర్స్‌మెంట్ రూపంలో వస్తుంది.. మిగిలిన రూ. 2 వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

ఈ పథకానికి కావాల్సిన పత్రాలు.. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫెన్సింగ్ వైర్ కోసం చెల్లించిన రశీదు వీటితో మీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 5 హెక్టార్లలో ఒక రైతు తన 20 బిగా శాశ్వత భూమికి కంచె వేస్తే 400 రన్నింగ్ మీటర్లకు గరిష్టంగా రూ. 56 వేలు అందజేస్తారు.

వ్యవసాయ శాఖ రైతుకు 400 మీటర్ల పొడవు కోసం కనీసం 1.5 హెక్టార్ల 6 బిఘా శాశ్వత భూమిని ఒక వ్యక్తిగత సమూహంలో ఒకే చోట ఫెన్సింగ్ కోసం రూ. 48,000 గ్రాంట్ ఇస్తుంది. ఈ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

ఫెన్సింగ్ ద్వారా రైతులు తమ పంటలను విచ్చలవిడి జంతువుల నుంచి కాపాడుకోవచ్చు. అన్ని రకాల రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. పథకం ప్రయోజనాలను పొందేందుకు, రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ పథకం ప్రయోజనాన్ని పొందడానికి.. రైతు కనీసం 1.5 హెక్టార్ల భూమిని ఒకే చోట కలిగి ఉండటం అవసరం.



దీని కంటే తక్కువ భూమి ఉన్నప్పటికీ.. 1.5 హెక్టార్లు లేదా అంతకంటే ఎక్కువ భూమి ఉన్న ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది రైతులతో కూడిన రైతు సమూహాలకు ఈ పథకం యొక్క ప్రయోజనాన్ని ఇవ్వడానికి ఒక నిబంధన ఉంది.

షెడ్యూల్డ్ తెగల ప్రాంతాలలో భూమి తక్కువ పరిమాణంలో ఉన్నందున, ఒకే చోట కనీసం 0.5 హెక్టార్ల భూమిని కలిగి ఉండటం అవసరం. ఈ రకమైన స్కీమ్ రాజస్థాన్‌లో అమల్లో ఉంది. ■

# అనాథ వృద్ధుల సేవలో తరిస్తున్న యోజన !

**నాకూ** అమ్మా నాన్నా ఉంటే బాగుండేది... పెరిగే వయసులో యోజన ఘరత్ ఈ మాట అనుకోని క్షణం లేదు. ఇప్పుడామెకు నూట పాతికమందికి పైగా తల్లితండ్రులు... వేలాది మంది నిస్సహాయ వృద్ధులను ఆమె దత్తత తీసుకున్నారు.

"నేను తల్లితండ్రులెవరో తెలియని అనాథను. నాకు ఊహ తెలిసేసరికి కోల్కతాలోని 'మిషనరీస్ ఆఫ్ ఛారిటీ'లో ఉన్నాను. మదర్ థెరిసా సంరక్షణలో పెరిగాను. అక్కడి నన్స్ నాలాంటి అనాథలను ఆప్యాయంగా చూసుకొనేవారు. మా అవసరాలను కనిపెట్టి తీర్చేవారు. కానీ ఎక్కడైనా తల్లితండ్రులతో కలిసి వెళుతున్న పిల్లలు కనిపించినప్పుడు నా మనసెంతో బాధపడేది. నాకూ అమ్మా నాన్నా ఉంటే బాగుండేదని ఎప్పుడూ అనుకొనేదాన్ని.



"మీరు వెళ్ళిన ప్రతి చోటా ప్రేమను వ్యాప్తి చెయ్యండి. మీ దగ్గరకు వచ్చినవారు ఎవరైనా... వారిలో సంతోషం నింపకుండా వెనక్కి పంపకండి" అని మదర్ థెరిసా చెప్పిన మాటలు నాలో బలంగా నాటుకున్నాయి. చదువు పూర్తి కాగానే... నాలాంటి వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నాను. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పని చేశాను. ఆ సమయంలోనే...దిక్కులేని వృద్ధులు ఎందరినో చూశాను. 'నా తల్లితండ్రులు ఇలాంటి వాళ్ళే అయి ఉంటారా? నన్ను పోషించే శక్తి లేక వదిలేసి ఉంటారా? ఇప్పుడు వాళ్ళు ఎక్కడో ఇదే పరిస్థితిలో ఉన్నారా?' అని ఆలోచించేదాన్ని.

**ఇది అంత తేలిక కాదు...**

దాదాపు పదేళ్ళకు పైగా ఎన్నో స్వచ్ఛంద సంస్థల్లో కొనసాగిన తరువాత... వృద్ధుల కోసం నేనే సొంతంగా పని చెయ్యాలనుకున్నాను. 2010లో మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా బోయ్సార్లో 'స్మిట్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాను. రైల్వేస్టేషన్లు, బస్టాండులు, ఆలయాల దగ్గర, వంతెనల కింద, ఆసుపత్రుల బయట నిస్సహాయంగా ఉండే వయోధికులకు ఆహారం, వసతి, వైద్యం అందించడంతో పాటు వారిలో నైరాశ్యాన్ని తొలగించి మానసిక స్థైర్యాన్ని నింపేదాన్ని. దీనికోసం ఎందరో ఉదారంగా ఎన్నో రూపాల్లో సాయం చేసేవారు. క్రమంగా వృద్ధులసంఖ్య పెరిగింది.

బోయసార్లో కొన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో ఠాణే జిల్లాలోని భివాండికి మారాం. మా సంస్థను 2017లో 'స్మిట్ ఓల్డేజ్ హోమ్ అండ్ కేర్ ఫౌండేషన్'గా రిజిస్టర్ చేశాను.

నా కార్యక్రమాలను గమనించి... స్వచ్ఛందంగా సేవలు అందించడానికి చాలా మంది ముందుకు వచ్చారు. అనాథలు, పేదలు, పిల్లలు వదిలేసినవారు, శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడు తున్నవారు... ఇలా అవసరంలో ఉన్న వృద్ధులకు నిరంత రాయంగా సేవలు కొనసాగిస్తున్నాను. ఇప్పటివరకూ 10,700 మందికి మా సంస్థ సేవలు అందించింది. 7,300 మందికి పైగా వివిధ దశల్లో ఆశ్రయం ఇచ్చింది. 5,200 మందిని నేను దత్తత తీసుకొని, వారి బాగోగులు చూస్తు న్నాను. వారిలో 3,800 మందికి మా సంస్థ ద్వారా వివిధ పనుల్లో శిక్షణ అందించి సాధికారత కల్పించాం. కోలుకున్నాక కొందరు తమ కుటుంబాల దగ్గరకు తిరిగి వెళ్ళారు.

మరికొందరు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న వృద్ధాశ్రమాలలో చేరారు. ఇలాంటి ఒక సంస్థను నడపడం తేలికైన విషయం కాదు. కనీస అవసరాల కోసం నెలకు పన్నెండు లక్షలకు పైగా ఖర్చవుతోంది. దాతల నుంచి, సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు అందించే మొత్తాల నుంచి దాన్ని సమకూర్చుకోవాల్సి వస్తోంది.

ఏది పెంచితే, ఏది పంచితే అదే నీకు దక్కుతుంది, ప్రేమ పంచితే ప్రేమ, ద్వేషం పెంచితే ద్వేషం

**సమాధానం దొరికింది...**

ప్రస్తుతం మా హోమ్‌లో 126 మంది శాశ్వతంగా ఆశ్రయం పొందుతున్నారు. వారంతా దాదాపుగా మంచం మీద నుంచి కదలలేనివారే. ఆహారం తినిపించడం, కాల కృత్యాల్లో సాయపడడం, డైపర్లు మార్చడం...ఇలా ప్రతి పనీ నేను, మా వాలంటీర్లు చేస్తాం. అందరూ నన్ను తమ కూతురులా భావిస్తారు. కష్టసుఖాలు చెప్పుకొంటారు. తమ జీవితానుభవాలు వివరిస్తూ ఉంటారు. నేను ఎరుగని నా కన్నవారిని వాళ్ళలో నేను చూసుకుంటున్నాను. నిస్సహాయత, ఒంటరితనం అంటే ఏమిటో నాకు తెలుసు.

వారికి కావలసింది మూడు పూటలా ఆహారం, నిద్రపోవడానికి ఒక మంచం మాత్రమే కాదు...వృద్ధాప్యంలో ఆరోగ్యపరమైన, భావోద్వేగపరమైన సమస్యలుంటాయి. తమతో కొంత సమయం గడిపి, తాము చెప్పేది వినేవారు కావాలని వారు కోరుకుంటారు. జీవితంలో అన్నీ కోల్పోయా మనే నిరాశలో ఉంటారు. వారిలో నైతిక స్థైర్యం నింపడానికి నేను, మా వాలంటీర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. 'హోమ్‌లో ఉన్న వారందరూ ఒకే కుటుంబం' అనే భావన కలిగేలా చూస్తాం. వారిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాం. ఓపిక, ఉత్సాహం ఉన్నవారిని చిన్న చిన్న పనుల్లో భాగస్వాముల్ని చేస్తాం. దివ్యాంగులు, ఇళ్ళ నుంచి తప్పిపోయిన పిల్లలకు కూడా హోమ్‌లో చోటు కల్పిస్తున్నాం.

నారీ శక్తి ప్రతిభా సన్మాన్, సామాజిక్ సేవా పురస్కార్, సమాజ్ రత్న పురస్కార్, బెస్ట్ సోషల్ వర్కర్ ఆదర్శ మహారాష్ట్ర మహిళా సన్మాన్, సావిత్రి బాయి ఫూలే సన్మాన్... ఇలా అనేక పురస్కారాలను, గౌరవాలను అందుకున్నాను.

ఇప్పుడు మా అమ్మాయిలు వర్షాలి, మయూరి కూడా ఫౌండేషన్ బాధ్యతలను పంచుకుంటున్నారు. ఇప్పటికీ మా సంస్థ అద్దె భవనంలోనే నడుస్తోంది. కనీసం మూడు వేలమందికి ఏకకాలంలో సరిపోయే సొంత భవనం నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఒకప్పుడు 'అమ్మా, నాన్నా ఎలా ఉంటారు? వాళ్ళను ఎక్కడ వెతకాలి?' అనే ప్రశ్నలు నన్ను వేధించేవి. నేను ఎంచుకున్న మార్గంలో వాటికి సమాధానం దొరికింది." ■

## ఈ మాటలు పిల్లలతో అనకూడదు సుమా!

**పి**ల్లలు ఏది చూసినా, ఏది విన్నా వెంటనే గ్రహించేస్తారు. అందుకే తల్లితండ్రులు వారితో జాగ్రత్తగా మాట్లాడాలి. వారిని మందలించేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. వారి మనసు నొచ్చుకోకుండా దారిలో పెట్టేందుకు ప్రయత్నం చేయాలి. అందుకేం చేయాలంటే...

- 'నువ్వు మీ నాన్నలానో, అమ్మలానో ప్రవర్తిస్తావు' అని పిల్లలతో అనడం వల్ల లాభం ఉండదు. ఎందుకంటే పోలిక మంచిగానే ఉన్నా కూడా అది మీ పిల్లలను ప్రభావితం చేస్తుంది.
- 'చాలా విసిగిస్తావు' అంటూ పిల్లల తీరుపై ముద్ర వేయొద్దు. వారి ప్రవర్తన గురించి పాజిటివ్‌గా అన్నా, నెగటివ్‌గా అన్నా అది పిల్లల మనసులో బలంగా నాటుకుంటుంది. అందుకే వారిని ఒక గాటన కట్టొద్దు.
- 'మీ నాన్న లేదా అమ్మ వెళ్లాక నీ పని చెబుతా'... అనే మాట పిల్లలను మందలించేందుకు అంటారు. దాంతో పిల్లల్లో అనవసరమైన భయం పెరుగుతుంది.
- 'ఆ పని చేసినందుకు థ్యాంక్యూ, ప్రతిసారి నువ్వెందుకు కుదురుగా ఉండవు' అనడం సరికాదు. తల్లితండ్రులు పిల్లలను ఒక పని బాగా చేశావని మెచ్చుకోవడం, మరో పని సరిగా చేయలేదని తిట్టడం వల్ల మంచిది కాదు. ఆ మాటలను పిల్లలు అవమానంగా భావిస్తారు.
- 'నాకు చికాకు తెప్పిస్తున్నావు' అంటూ తమ పరిస్థితికి పిల్లలను బాధ్యులు చేయొద్దు. మానసికంగా బలంగా ఉండే తల్లితండ్రులు తమ భావోద్వేగాలు, మానసిక పరిస్థితి విషయమై పిల్లలను తిట్టిపోయరు.
- 'నాతో వాదించకు' అంటూ పిల్లలను హెచ్చరించడం వారిని క్రమశిక్షణలో పెట్టేందుకు ఏ విధంగానూ తోడ్పడదు. పిల్లలను దారిలో పెట్టేందుకు ప్రేమగా మందలించాలి. ఒకటికి రెండుసార్లు చెప్పి చూడాలి. ■

# తల్లిదండ్రులూ ... పిల్లలతో బహుపరాక్ !

**"మా** అబ్బాయికి ఇంకా ఆరు నెలలు రాలేదు. అప్పుడే ఫోన్లో కార్టూన్లు చూసేస్తున్నాడు. వీడియోలు మార్చడం కూడా తెలిసిపోయింది" – ఇది చాలామంది తల్లితండ్రుల మురిపెం.

"చదువు పూర్తిగా పక్కన పెట్టేశాడు. ఎవర్నీ కలవడు. ఎవరితోనూ మాట్లాడడు. రాత్రీ పగలూ స్మార్ట్ ఫోనే ప్రపంచం. తిండి మీద ధ్యాసలేదు. ఎప్పుడు నిద్రపోతున్నాడో కూడా తెలీదు"... – ఇది మరికొందరు తల్లితండ్రుల ఆవేదన.

మొదట్లో ముచ్చటగా అనిపించినది కొన్నేళ్ళు గడిచేసరికి ఆందోళనగా మారుతోంది. ప్రస్తుత సమాజంలో ప్రతిచోటా కనిపిస్తున్న ఈ ధోరణుల గురించి తన తాజా పుస్తకం 'ఐ పేరెంట్: ఎంబ్రాసింగ్ పేరెంటింగ్ ఇన్ ది డిజిటల్ ఏజ్'లో చర్చించారు రచయిత్రి, కాలమిస్ట్ నేహా జె.హీరానందాని. ఆ వివరాలు ఆమె మాటల్లోనే

"రచనకు... ఆ మాట కొస్తే సృజనాత్మకమైన ఏ పనికైనా ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. 'ఐ పేరెంట్' రాయడానికి నాకు ప్రేరణ నేను ఊహించని విధంగా... మా అమ్మాయి జోయా నుంచి దొరికింది. ఆమె స్కూల్ వాళ్ళు ఒక కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు. చరిత్ర సృష్టించిన ఒక గొప్ప పాత్రలా దుస్తులు ధరించి రావాలని పిల్లలకు సూచించారు. "మహాత్మా గాంధీ, మదర్ థెరిసాలా చాలామంది తయారై వస్తారేమో? నువ్వేం చేద్దామనుకుంటున్నావ్?" అని జోయాను అడిగాను. నా ఆలోచనల్లో మహాత్ముడు, థెరిసా చరిత్రను రూపుదిద్దిన వ్యక్తులు.

కానీ "అదేం కాదమ్మా! చాలామంది 'మిస్టర్ బీస్ట్'లా దుస్తులు వేసుకొని వస్తారు" అంది జోయా. కొంతసేపు నాకు నోట మాట రాలేదు. ఆ తరువాత ఆలోచిం చాను. మన పిల్లలది ఒక కొత్త ప్రపంచం. మనకు సమాంతరంగా ఉన్న మరో విశ్వంలో వాళ్ళు జీవిస్తున్నారు. వాళ్ళకు ఆసక్తి కలిగించే, స్ఫూర్తిని అందించే అంశాలు పూర్తిగా భిన్నమైనవి. వారి గురించీ, వారి పెంపకం గురించి చర్చిస్తూ ఒక పుస్తకం రాయాలనుకున్నాను. అదే 'ఐ పేరెంట్'.

**వారిది మరో ప్రపంచం...**

మానవ చరిత్రలో ఇంటర్నెట్ స్థాయిలో ప్రభావం చూపించిన అంశం మరొకటి లేదనేది నా అభిప్రాయం. అంతర్జాతీయ స్థాయిలో ఒక పెద్ద ప్రయోగానికి మన మందరం సాధనాలుగా మారిపోయాం. కుప్పలు తెప్పలుగా సమాచారాన్ని కుమ్మరిస్తూ...సవాళ్ళు విసిరి, గందరగోళానికి గురి చేస్తున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల పెంపకం సులభం కాదు. మనకు అంతగా అవగాహన లేని ఒక ప్రపంచంతో మమేకమైపోయిన పిల్లలకు మార్గదర్శకత్వం వహించడం తల్లితండ్రులకు సవాల్‌గా నిలుస్తోంది. పిల్లలకు తామే ప్రపంచం అని తల్లితండ్రులు భావిస్తారు. ఆన్‌లైన్లోనే జీవిస్తున్న ఈ 'జెనరేషన్ జెడ్' (1990ల చివరి నుంచి 2010ల తొలినాళ్ళ మధ్య పుట్టినవారి) విషయంలో అది నిజం కాదు. వాస్తవానికి వాళ్ళు తమదైన ప్రపంచంలో ఉన్నారు. అది ఎలాంటి సరిహద్దులూ లేని క్రీడామైదానం లాంటిది. వాళ్ళ స్నేహాలు, ఘర్షణలు, ప్రేమలు... ఇలా అన్నీ దానితోనే ముడిపడుతున్నాయి. అంటే పెద్దల ప్రపంచం ఒకటైతే... ఆన్‌లైన్లో జీవిస్తూ, అక్కడే నేర్చుకుంటూ, దాన్నే శ్వాసిస్తున్న పిల్లల ప్రపంచం మరొకటి. ఈ రెండు ప్రపంచాలనూ కలపాలన్నదే నా ప్రయత్నం.

**సౌకర్యం... వ్యసనం కూడా!**

ఇప్పటి పిల్లలు ఒక చేత్తో స్మార్ట్ ఫోన్తో, మరో చేత్తో ట్యాబ్లెట్‌తో పుడుతున్నారు. వారిలో చాలామందికి నడవడం రాకముందే ఒక పరికరం చేతికి వస్తోంది. దాన్ని క్లిక్ చెయ్యడం, స్క్రోల్ చెయ్యడం లాంటివి అన్నప్రాసనకన్నా ముందే వాళ్ళు నేర్చుకుంటున్నారు. మొదటి మాట నోటి నుంచి రాకముందే... ఆ పరికరాన్ని ఎలా వాడాలనేది వాళ్ళకు పూర్తిగా తెలిసిపోతోంది. దీనికి బాధ్యత పూర్తిగా తల్లితండ్రులదే. పెద్దల విషయానికొస్తే... ఒక సగటు వ్యక్తి గంటకు కనీసం 12 సార్లు తన ఫోన్‌ను చెక్ చేస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ చేతిలో లేని

జీవితాన్ని మనం ఊహించలేం. అవి వార్తలను అందిస్తున్నాయి, మనల్ని సమాజంతో అనుసంధానిస్తున్నాయి, వినోదాన్ని పంచుతున్నాయి, విద్యా సంబంధమైనవి తెలియజేస్తున్నాయి. మరోవైపు పోర్న్ పోర్టల్స్ దుష్ప్రభావాలనూ కలిగిస్తున్నాయి. ఒకేఒక పరికరం ఉంటే చాలు... ఇవన్నీ సాధ్యమవుతున్నాయి. ఇది ఇదివరకూ ఎన్నడూ ఊహకైన అందని గొప్ప సౌకర్యం. అదే సమయంలో పెద్ద వ్యసనం కూడా. ఈ వ్యసనం మానసిక వైకల్యాలకు కారణమవుతోంది. పెద్దలే ఈ సుడిగుండంలో పడి మునిగిపోతున్నప్పుడు... మానసిక పరిపక్వత లేని పిల్లల పరిస్థితి ఏమిటి?

**మొదటి గ్లోబల్ జనరేషన్...**

నా పుస్తకం పిల్లల డిజిటల్ అడిక్షన్ గురించి చర్చించడానికి మాత్రం కాదు. 'ఆ పిల్లలతో ఎలా వ్యవహరించాలి? వాళ్ళను ఎలా అర్థం చేసుకోవాలి? అవసరమైనప్పుడు వాళ్ళకు ఎలా అండగా నిలవాలి?' అనే అంశాలను ప్రధానంగా చర్చించాను. అందుకే ఇదంతా డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి కాబట్టి నా పుస్తకానికి 'ఐ పేరెంట్' అని పేరు పెట్టాను. తల్లితండ్రుల మీద కూడా డిజిటల్ ప్రభావం ఎక్కువగానే ఉంది.

ఉదాహరణకు...ఇంగ్లండ్‌కో, బ్రిటన్‌కో చెందిన వాళ్ళెవరో... .చిన్న పిల్లలకు పెట్టే ఆహారంలో నెయ్యి ఉండాలా? వద్దా?' అనేది వాళ్ళ పరిజ్ఞానం మేరకు రాస్తారు. మన దేశంలో దాన్ని చదివిన తల్లితండ్రుల్లో ఏవో అనుమానాలు మొదలవుతాయి. జీవితంలోని ప్రతి విషయంలోకి టెక్నాలజీ చొచ్చుకు వచ్చేస్తున్నప్పుడు... ఒకే విధమైన ఆనందాలే కాదు, ఒకే రకమైన సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. సైబర్ వేధింపులు, సోషల్ మీడియాను అతిగా ఉపయోగించడం, గేమ్స్‌కు బానిసలు కావడం... పిల్లల మీద తల్లితండ్రుల నుంచి వినిపిస్తున్న ప్రధానమైన ఫిర్యాదులు.

అంతేకాదు... పిల్లల పట్ల అతి ప్రేమ, శృతిమించిన గారాబం వల్ల కూడా పెంపకం కష్టమవుతోంది. ప్రతి తరానికి తనదైన కలలుంటాయి. అయితే 'జనరేషన్ జెడ్' అద్భుతమైన తరం. వాళ్ళది మొట్టమొదటి గ్లోబల్ జనరేషన్. తమ సరిహద్దులను దాటి వాళ్ళు చూస్తున్నారు, ప్రపంచం పరస్పరం ఎలా అనుసంధానం అవుతోందో, ఒక ప్రాంతానికో, దేశానికో సంబంధించిన సమస్య ప్రపంచ సమస్యగా ఎలా మారుతుందో గ్రహిస్తున్నారు. వాళ్ళకు ఎన్నో విషయాల గురించి అవగాహన ఉంది.

టీనేజిలోకైనా ఇంకా ప్రవేశించని పిల్లలు వాతావరణ మార్పుల మీద ప్రపంచవ్యాప్తంగా ఎలా ఉద్యమిస్తున్నారో మనం చూస్తున్నాం. అదే సమయంలో... వేరొకరితో ఎక్కువగా పోల్చుకోవడానికి, అవాంఛనీయమైన పోటీకి కూడా సాంకేతికత దారి తీస్తోంది. అది ఈ తరాన్ని అపరిమితమైన ఒత్తిడికి, మానసికమైన దుర్బలత్వానికి గురిచేస్తోంది. ఈ పరిణామాలన్నిటినీ నా పుస్తకంలో చర్చించాను. తల్లితండ్రులకు నేను చిట్కా వైద్యం లాంటి పరిష్కారాలేవీ నేను చెప్పలేదు. డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి ఆరోగ్యకరమైన చర్చ ప్రారంభించాలన్నదే నా ఉద్దేశం."

నేహా కాలమిస్ట్, రచయిత్రి. అమెరికాలోని మసాచుసెట్స్ వెల్లస్లీ కాలేజీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఆంగ్ల సాహిత్యంలో ఆనర్స్ డిగ్రీ, హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎడ్యుకేషన్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు.

'యునిసెఫ్'తో కొన్నాళ్ళు పని చేసిన తరువాత... ఆర్థిక, సామాజిక అంశాలపై హఫింగ్టన్ పోస్ట్, వోగ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రముఖ పత్రికల్లో కాలమ్స్ రాశారు.

పిల్లల కోసం 'ది పద్మాస్' పేరిట 50 మంది 'పద్మ పురస్కార గ్రహీతల' జీవిత పరిచయాలతో పుస్తకాన్ని వెలువరించారు. స్ఫూర్తిదాయకులైన 50 మంది భారతీయ మహిళలపై 'గర్ల్ పవర్: విమెన్ హూ బ్రోక్ ది రూల్స్' అనే పుస్తకం రాశారు. చదవడం, రాయడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం... ఇవీ ఆమె ప్రధానమైన అభిరుచులు. దాదాపు ఇరవయ్యేళ్ళ నుంచి వివిధ సామాజిక అంశాలపైనా, లింగ సమానత్వంపైనా వివిధ రచనల ద్వారా తన గళాన్ని వినిపిస్తున్నారు.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

# 20 లక్షల పెట్టుబడితో రూ.95 లక్షలకు పైగా లాభం!

కరువు ప్రాంతంలో ఓ రైతు అద్భుతం చేశాడు. తన కొద్దిపాటి భూమిలో అద్భుతమైన పంట వేసి.. భారీ లాబాలను సొంతం చేసుకున్నాడు. కేవలం రూ. 20 లక్షల ఖర్చు చేసి.. రూ. 95 లక్షలు సంపాదించాడు. దీంతో ఇతర రైతులకు అతను ఆదర్శంగా నిలిచాడు.

కర్నాటక చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకాలోని హులిహళ్లి గ్రామం.. గత సంవత్సర కాలం నుంచి కరువుతో అల్లాడిపోతోంది. అయితే ఆ కరువు ఇప్పుడు దానిమ్మ సాగుదారులకు వరంలా మారింది. దానిమ్మలో బంపర్ పంట కూడా పండడంతో ఈ రైతు ఫుల్ ఖుష్ అవుతున్నాడు.

హులిహళ్లికి చెందిన రమేష్ అనే (45) రైతు ఎనిమిది ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశాడు. గతంలో తొలిసారి దానిమ్మ సాగుని ప్రారంభించాడు. దానిమ్మ సాగుతో ఎలాంటి లాభం రాదని.. అధిక నష్టం వస్తుందని తోటి రైతులు అతనికి చెప్పాడు.. కానీ భూతల్లిని నమ్ముకొని దానిమ్మ సాగు చేయగా.. ప్రస్తుతం బంపర్ పంట చేతికి వచ్చింది. దీంతో కరువు తనకు వరంలా మరిందని రైతు చెపుతున్నాడు.

నాటిన 2,400 మొక్కల్లో దానిమ్మ మొక్కల దిగుబడి ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. అన్ని ఉత్పత్తులను రూ. 95 లక్షలకు విక్రయించాడు. అది కూడా వారు పండించిన భూమిలోనే పంటను విక్రయించాడు. ఈ దానిమ్మ పండ్లు తమిళనాడు, బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా ఎగుమతి అవుతున్నాయి. రమేష్ పండించిన దానిమ్మను కిలో రూ. 160కి విక్రయించాడు. హులిహళ్లి, చుట్టుపక్కల గ్రామాల్లో కొందరు దానిమ్మ సాగు చేసినా ఎవరికీ ప్రయోజనం కలగలేదు. వారంతా మంచి పంట లేక నష్టపోగా.,రమేష్ ఒక్కడే బారీ దిగుబడి సాధించాడు. ■

# స్వయంసహాయ సహకారి నందాకు ఘన నివాళి

రిజర్వ్ బ్యాంక్, నాబార్డ్ వంటి దిగ్గజ సంస్థలలోను, వివిధ జాతీయ అంతర్జాతీయ సంస్థలలోను కీలక పదవులు నిర్వహించిన శ్రీ వై సి నందా ఆగస్టు 27 వతేదీన కన్నుమూశారు. ఈ పదవులకంటె నాబార్డ్ ఛైర్మన్‌గా, రైతుల జాతీయ మండలి సభ్యునిగా, వ్యవసాయ ఆర్థిక సంస్థ ఛైర్మన్‌గా స్వయంసహాయ రంగానికి , వ్యవసాయ,గ్రామీణాభివృద్ధి రంగాలకు ఆయన అందించిన ప్రోత్సాహం, ఆ రంగాల అభివృద్ధిపట్ల ఆయన చూపిన మక్కువ, ఆయన వేసిన ముద్ర ఆయనకు ఎందరో అభిమానులను సంపాదించిపెట్టింది. నాబార్డ్ మాజీ ఛైర్మన్, ఏపిమాస్ మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ పమిడి కోటయ్య శ్రీ నందా మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ, శ్రీ నందా తనకు సహోద్యోగి, చాలా కాలంగా మిత్రుడని, ఆయనకు స్వయంసహాయ రంగం అభివృద్ధిపట్ల ఎంతో మక్కువ అని నివాళులు అర్పించారు. శ్రీ నందా స్వయంసహాయ ఉద్యమానికి, వ్యవసాయ,గ్రామీణాభివృద్ధి రంగాలకు ఎనలేని సేవ చేశారని, స్వయంసహాయ సంస్థల నిర్వహణను ప్రభుత్వం చేపట్టాలనే అభిప్రాయాన్ని ఆయన గట్టిగా వ్యతిరేకించేవారని, ఆ చర్య మహిళా సాధికారత కృషిని నీరుగార్చడమేనని శ్రీ నందా పేర్కొనేవారని, ఏపిమాస్ రూపొందించిన ఒక విడియోలో ఆయనతో చిన్నపాటి ఇంటర్వ్యూ వుందని ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి ఆయనకు స్మృత్యంజలి ఘటించారు. ఏపిమాస్ తరపున ఎస్ హెచ్ జిలతో బ్యాంకుల అనుసంధానంపై విడియో రూపొందించడంలో ఆయనతో ఏర్పడిన కొద్దిపాటి పరిచయం తనకు చాలా గొప్ప అనుభూతి అని ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి నివాళులు అర్పించారు. ■

సరైన నిర్ణయం ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, తప్పుడు నిర్ణయం అనుభవాన్ని పెంచుతుంది ; రెండూ మంచితే

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు

డైరీఫాం, పౌల్ట్రి




పందిళ్లపై
కూరగాయల సాగు



బహుళ
పంటల సాగు







పెరట్లో కూరగాయల
పెంపకం



చిరు ధాన్యాల సాగు



చిరు ధాన్యాల ప్రాసెసింగ్

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-09-2024 ; Posting Date: 05 & 06-09-2024

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26



నిమ్స్మేలో శిక్షణ యిచ్చిన శ్రీ సి ఎస్ రెడ్డికి సన్మానం



హైదరాబాదులో జరిగిన 5 కె రన్‌లో ఏపిమాస్ బృందం



ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో జండా వందనం



భీముని పట్నం, కోటపాడులలో ఏపిమాస్ కార్యక్రమాలు .... కులుమాల విద్యార్థినులకు స్వాతంత్ర్య దినోత్సవ బహుమతులు



రైతు నేస్తం , రెడ్డెమ్మ ఎఫ్ పి సి లు, వి కోట ఎఫ్ పి ఓ, వార్షిక మహాసభలు

To ADDRESS



విశాఖపట్నంలో ' వాష్ ' కార్యక్రమం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089